జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 29, జూన్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## తెలంగాణ గవర్నర్‌తో బాబు-లోకేష్ భేటీ

- బాబు ఇంటికి వచ్చిన గవర్నర్ రాధాకృష్ణన్

ఉండవల్లిలోని తమ నివాసానికి వచ్చిన తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌కి స్వాగతం పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్





# ఎందుకీ కూల్చి'వేత'లు?

- వైసీపీ ఆఫీసుల కూల్చివేతలపై చర్చ
- ఆసుపత్రులుగా మార్చండి
- ప్రభుత్వ భవనాలుగా మార్చినా సరే
- నిర్మాణ ఖర్చు మిగిలినట్లే
- హెచ్‌ఓడీలకు ఇస్తే సరి
- కలెక్టర్లు,ఎస్పీలకు క్యాంపు ఆఫీసులేవీ?
- అద్దె ఖర్చులూ ఆదా
- ప్రజల్లో వ్యతిరేకతా ఉండదు
- కూల్చివేస్తే టీడీపీ-వైసీపీకి తేడా ఏమిటి?
- విధాన నిర్ణయంపై ఎదురుచూపులు
- తటస్థులు, విద్యావంతుల్లో చర్చ

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఏపీలో అమరావతి వైసీపీ కార్యాలయం సహా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ స్థలాల్లో ఆ పార్టీ నిర్మించిన పార్టీ కార్యాలయాల కూల్చివేతపై ప్రజల్లో ఆసక్తికరమైన చర్చకు తెరలేచింది. ప్రభుత్వ భూములను లీజుకు తీసుకుని, అనుమతి లేకుండా వైసీపీ నిర్మించి- నిర్మిస్తున్న రాజభవనాల వంటి పార్టీ కార్యాలయాలను కూల్చివేయటం అనవసరమన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. అవి ఎలాగూ ప్రభుత్వ భూమి కాబట్టి, వాటిని స్వాధీనం చేసుకుని ప్రజోపయోగ కార్యక్రమాలకు వాడుకుంటే బాగుంటుందన్న వాదన వినిపిస్తోంది.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి సహా, అన్ని జిల్లాల్లోనూ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములు లీజులు తీసుకుంది. అయితే వాటికి ఎలాంటి అనుమతులూ లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా పార్టీ ఆఫీసులకు ప్రభుత్వ భూములు కేటాయించినప్పటికీ, అన్ని అనుమతులూ తీసుకున్న తర్వాతనే పార్టీ ఆఫీసులు నిర్మించింది. దానికోసం వివిధ శాఖల నుంచి అనుమతులు ఆలస్యమైనప్పటికీ అప్పటివరకూ వేచి చూసి, అవి వచ్చిన తర్వాతనే ఆఫీసులు నిర్మించింది.

కానీ వైసీపీ మాత్రం వివిధ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, కేవలం దరఖాస్తు చేసి వాటి నుంచి ఎలాంటి మంజూరు లేకుండానే, రాజభవనాల తరహాలో పార్టీ ఆఫీసులు నిర్మించింది. ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత, అనుమతులు లేని వైసీపీ ఆఫీసులను కూల్చాలని ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో కొన్ని ఆఫీసులను కూల్చివేసింది.

అయితే ఈ విధానం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, పైగా వాటి కూల్చివేతకు ప్రభుత్వానికి అదనపు ఖర్చు అని వివిధ వర్గాలు మిగతా.. 2లో

## ఐపీఎస్‌ల బదిలీ

- సీఐడీ చీఫ్‌గా రవిశంకర్ అయ్యన్నార్
- ఏసీబీ డీజీగా అతుల్ సింగ్
- విశాఖ సీపీగా శంకబ్రత బాగ్చి



అమరావతి,మహానాడు: ఏపీలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల్ని ప్రభుత్వం బదిలీ చేసింది. ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు డీజీ అతుల్ సింగ్‌ను ఏసీబీ డీజీగా నియమించింది. విశాఖ సీపీగా ఉన్న రవిశంకర్ అయ్యన్నార్‌ను సీఐడీ అదనపు డీజీగా, అలాగే.. శాంతి భద్రతల అదనపు డీజీ శంకబ్రత బాగ్చిని విశాఖ సీపీగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.



## కేసీఆర్‌కు మరో షాక్

- కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఢిల్లీలో యాదయ్యకు రేవంత్ కాంగ్రెస్ కండువా
- బీఆర్ఎస్‌కు వరస ఝలక్‌లు



ఢిల్లీ,మహానాడు: పదేళ్లు తెలంగాణను కంటిచూపుతో శాసించిన కేసీఆర్‌కు ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలే వరస వెంట వరస ఝలక్ ఇస్తున్నారు. తాజాగా చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య కారు దిగి, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో 'చేయి' కలిపారు. ఆయనను తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడయిన తాను, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానని యాదయ్య చెప్పారు. మరికొద్దిరోజుల్లో మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా కారు దిగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.




## సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పి.వి.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2లో

## పోలవరానికి శాపం జగన్

అమరావతి,మహానాడు: పోలవరం విధ్వంసంతో జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. జగన్ మూర్ఖత్వం వల్లే డయాఫ్రం వాల్



దెబ్బతిందని...డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయం జగన్ కు కూడా రెండేళ్ల తర్వాత తెలిసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో పోలవరం ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులు కూడా పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరం ప్రాజెక్టు దుస్థితిపై వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్ లో శ్వేతపత్రం విడుదల చేశారు. దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ మిగతా.. 2లో

- జగన్ మూర్ఖపు నిర్ణయాల వల్లనే డయాఫ్రం వాల్ దెబ్బతింది
- జగన్ అసమర్థత, అహంకారం, దుస్సాహసం వల్ల ప్రాజెక్టు మనుగడే ప్రమాదంలో పడింది
- ఏజెన్సీలను మార్చొద్దని పీపీఏ చేసిన హెచ్చరికలను సైతం పెడచెవిన పెట్టారు
- ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను సైతం దారిమళ్లించారు
- వాస్తవాలు దాచి పెట్టి పోలవరం పూర్తి చేస్తాం అంటూ తప్పుడు ప్రకటనలు చేశారు
- టీడీపీ హయాంలో 72 శాతం పనులు పూర్తైతే... వైసీపీ ప్రభుత్వం చేసింది కేవలం 3.84 శాతం మాత్రమే
- పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లే అంటూ కొత్త ప్రతిపాదనలు తెచ్చారు.
- పోలవరం ప్రాజెక్టు దుస్థితిని చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది.
- ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు శ్వేతపత్రం విడుదల
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- పోలవరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని వివరించిన సీఎం చంద్రబాబు
- సచివాలయంలో మొదటి బ్లాక్‌లో మీడియా సమావేశం నిర్వహించి ప్రాజెక్టు దుస్థితిపై శ్వేతపత్రం విడుదల

## ఆంధ్రావర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా

- అదే దారిలో రిజిస్ట్రార్ స్టీఫెన్‌సన్
- ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొ. కిశోర్‌బాబు
- 'మహానాడు' ఎఫెక్ట్



విశాఖ,మహానాడు: ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌సన్ తమ పదవులకు రాజీనామా చేశారు. ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొ.కిశోర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆంధ్రా వర్శిటీ వీసీ ప్రసాద్‌రెడ్డి జగనాభిమానంపై నిన్నటి మహానాడు దినపత్రికలో వార్తా కథనం వెలువడిన విషయం తెలిసిందే.

చంద్రబాబు నాయుడు సీఎం అయినప్పటికీ, ఇప్పటివరకూ వీసీ చాంబరులో సీఎం ఫొటో పెట్టని వైనంపై మహానాడులో వార్తా కథనం వెలువడింది.

గత ఐదేళ్లలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి యూనివర్సిటీని భ్రష్టు పట్టించారంటూ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా, వీసీ ఛాంబర్‌ను, వర్సిటీని వైకాపా కార్యాలయంగా మార్చేశారని, వైకాపా పెద్దల కనుసన్నల్లోనే పనిచేశారనే అభియోగాలు ఉన్నాయి. వైకాపా గెలుపు కోసం పరిశోధకులను ఉపయోగించుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం రావడంతో వీసీ తన పదవికి రాజీనామా చేశారు.

## బీసీలకు టీడీపీ పెద్దపీట

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన పల్లాశ్రీనివాసరావు
- టీడీపీ కోసం ఏమి ఆశించకుండా పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం
- కార్యకర్తలు ఏ సమస్య ఉన్న పార్టీ కార్యాలయానికి వచ్చి విన్నవించుకోవచ్చు
- ప్రతి కార్యకర్త సమస్య పరిష్కారానికి కృషి చేస్తా
- పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలి
- త్వరలోనే టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసుల తొలగింపు కృషి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

04



కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ కోసం దేనికైనా సిద్ధం 3లో




సెప్టెంబర్ 21న 203 అన్న క్యాంటీన్లు ప్రారంభం 3లో




ప్రజలు సమయమిస్తే మళ్లీ పూర్వవైభవం 3లో



పవన్ కళ్యాణ్.. బిజీబిజీ 4లో



అక్షరాల గుడిలో.. భువనమ్మ ఒడిలో.. 4లో



సీజనల్ వ్యాధుల నియంత్రణకు రూ.50 కోట్లతో ప్రత్యేక డ్రైవ్ 5లో



పిన్నెల్లి పాపం పండింది 6లో



భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి 7లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 29, జూన్ 2024

# పోలవరానికి శాపం జగన్

(మొదటిపేజీ తరువాయి..)

ఇచ్చారు. ఈ సంద ర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...."సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. వైసీపీ 5 ఏళ్ల విధ్వంసంతో రాష్ట్రం ఎలా నష్టపోయిందో కూలంకుశంగా ప్రజల్లో చర్చజరగాలి. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారు.

ఫోర్త్ ఎస్టేట్ కూడా గత ప్రభుత్వానికి భయపడింది. కోర్టులను కూడా బ్లాక్ మెయిల్ చేసి జడ్జిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. రాష్ట్ర పునర్నిర్మాణం జరగడానికి మేమంతా కష్టపడి పని చేస్తాం. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలవాలి అని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ప్రజలు గెలిచి...చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. ఇక రాష్ట్రాన్ని నిలబెట్టడంలో అందరూ భాగమైతే దానికి మేము బాధ్యత తీసుకుంటాం. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో దెబ్బతిన్న వాటిలో 7 ప్రధాన అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెట్టే ముందు మన సమస్యలు కూడా కేంద్రం ముందు ఉంచాలి. అందుకే 25 రోజుల్లోనే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేసి తర్వాత రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడతాం. ఇరిగేషన్ సంబంధించి ఒక వెబ్ సైట్ ప్రారంభించి అందులో అన్ని అంశాలను ఉంచుతాం. చెప్పిన తప్పులనే వందసార్లు చెప్పి ప్రజల్ని నమ్మించాలని చూస్తున్నారు... దానికి వాస్తవాలతో చెక్ పెడతాం.

అవాస్తవాలన్నింటికీ ప్రజలే బుద్ధి చెప్పేలా వాస్తవాలు ప్రజల ముందు ఉంచుతాం. రాష్ట్రానికి సాగునీటి ప్రాజెక్టుల అవసరం ఎంతో ఉంది. ఆ ఉద్దేశ్యంతోనే టీడీపీ హయాంలో రూ.67 వేల కోట్లు ఇరిగేషన్ పై ఖర్చు చేశాం. కనీసం గత ప్రభుత్వం వాటి నిర్వహణకు కూడా నిధులు ఇవ్వలేదు." అని సీఎం చంద్రబాబు అన్నారు.

### పోలవరం విధ్వంసంతో జగన్ రాష్ట్రానికి ద్రోహం చేశాడు

"రాష్ట్రానికి రెండు ప్రధానమైన ప్రాజెక్టుల్లో ఒకటి పోలవరం...రెండు అమరావతి. ఆ రెండూ రాష్ట్రానికి రెండు కళ్లులాంటివి. అవి పూర్తి చేసుకుంటే రాష్ట్రానికి ఉన్న నష్టాన్ని పూడ్చుకోవచ్చు. జగన్ పోలవరానికి ఒక శాపంగా మారారు. జగన్ చేసిన నేరం క్షమించరానిది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా జగన్ ను అందరూ నిలదీయాలి. రాష్ట్రాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. దక్షణ భారతదేశంలో అత్యధిక నీళు ఉండే ఏకైక నది గోదావరి. యేటా 3 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోంది. వీటిని వినియోగించుకుంటే రాష్ట్రంలో కరవు అనేది ఉండదు.

పోలవరంలో ముంపునకు గురయ్యే 7 మండలాలు నాడు తెలంగాణలో ఉన్నాయి...అవి ఏపీలో కలిపితేనే ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పడంతో మొదటి కేబినెట్ సమావేశం లోనే ఏపీలో కలుపుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఉత్త రాంధ్ర, రాయలసీమకు తాగు, సాగు నీరు అందించే బహుళార్ధక సాధక ప్రాజెక్టు. 2014లో విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే 2019 నుండి 2024 మధ్య జరిగిన నష్టమే ఎక్కువ. పోలవరం ద్వారా 7.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు... 23.50 లక్షల ఎకరాలు స్థిరీక రించవచ్చు. పరిశ్రమలకు సమృద్ధిగా నీరందించవచ్చు. టీడీపీ హయాంలో ఒకే రోజున 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసి గిన్నిస్ రికార్డ్ సృష్టించాం. నేను 31 సార్లు క్షేత్రస్థాయిలో పోలవరంలో పర్యటించాను. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే వ్యవసాయానికి ఊతం వస్తుందనే శ్రద్ధ పెట్టాను.

ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ క్లియర్ చేశాను. పోలవరం ప్రాజెక్టుకు టీడీపీ హయాంలో రూ.11, 762.47 కోట్లు ఖర్చు చేస్తే...వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ చేతకానితనం, అహంభావం వల్లే ప్రాజెక్టు దెబ్బతింది. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజే ప్రాజెక్టు పనులు నిలిపేశారు. ప్రాజెక్టు పరిస్థితి ఏంటో చూడకుండా పనులు నిలిపేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే పని చేసే ఏజన్సీలను తొలగించారు.

2019 జూన్ నుండి నవంబర్ వరకు ప్రాజెక్టుకు ఏజన్సీ లేదు. వరదలతో డయాఫ్రం వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు స్పష్టం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బ తిందని రెండేళ్ల తర్వాత కనుక్కున్నారు. టీడీపీ హయాంలో ఉన్న కాంట్రాక్టరు పనితీరు సంతృప్తికరంగానే ఉంది.. మార్చాల్సిన పనిలేదని పీపీఏ తమ మినిట్స్ లో పేర్కొంది.

2009లో కాంట్రాక్టరును మార్చడం వల్ల హెడ్ వర్క్స్ పనులు నిలిచిపోయాయి...కాంట్రాక్టర్ ను మార్చితే జాప్యం జరుగుతుందని పీపీఏ హెచ్చరించింది. కొత్తకాంట్రాక్టరను మార్చడం వల్ల పనుల్లో జాప్యం జరుగిందని పీపీఏ తెలిపింది. ఒకే పనిని రెండు ఏజన్సీలు చేస్తే నాణ్యత దెబ్బతింటుదని చెప్పినా వినలేదు.

కాంట్రాక్టర్‌ను మార్చడం, ముందు చూపు లేకపోవడంతో పనులు తీవ్ర జాప్యం అవుతాయని కేంద్ర ఇరిగేషన్ సెక్రటరీకి పీపీఏ లేఖ కూడా రాసింది. మేము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదు..కానీ జగన్ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకున్నారు. తనకు అన్నీ తెలుసు అన్నట్లుగా వ్యవహరించారు." అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### జగన్ నిర్వాకంతోనే డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాం డ్యామేజీ

"పోలవరం ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలను ఎత్తిచూపేం దుకు నీతి ఆయోగ్ నియమించిన నిపుణుల కమిటీ కూడా ప్రభుత్వ అసమర్ధ ప్రణాళికతోనే డయాఫ్రం వాల్ దెబ్బతిందని నివేదిక ఇచ్చింది. డయాఫ్రం వాల్, ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. 2018లో రూ.436 కోట్లతో డయాఫ్రం వాల్ పూర్తి చేశాం...కానీ గత ప్రభుత్వ నిర్వాకంతో డ్యామేజ్ అయిన పనులకే ఇప్పుడు రూ.447 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు చెప్పిన దాన్ని బట్టి చూస్తే తెలుస్తోంది.

కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది. దానికి కూడా మూడు నాలుగు సీజన్లు పడు తుందని అధికారులు అంటున్నారు. జగన్ మూరత్వంతో చేసిన పనికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. జగన్ విధ్వంసంతో ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులే మారిపోయాయి. ఎగువ కాఫర్ డ్యాం నుండి వచ్చిన వరద ఉధృతికి గ్యాప్-1 వద్ద 150 మీటర్ల గట్టు కొట్టుకుపోయింది. జగన్ నిర్లక్ష్యం, విధ్వంసంతో ప్రాజెక్టుకు సహజ సిద్ధంగా లభిం చేవి కూడా ప్రమాదంగా మారి ప్రాజెక్టుస్థితినే మార్చేశాయి.

గైడ్ బండ్ కుంగిపోయింది. నేరుగా నీళ్లు వస్తే ప్రజర్ తగ్గుతుందని గైడ్ బండ్ ను రూ.80 కోట్లతో నిర్మించాం. డయాఫ్రం వాల్, ఎగువ-దిగువ కాపర్ డ్యాం, గైడ్ బండ్ ఈ మూడు డ్యామేజీలు జగన్ నిర్వాకం వల్లే జరిగినవే...వాటి వల్ల ప్రాజెక్టు పనులు, పవర్ హౌస్ ఆలస్యం అవుతున్నాయి. " అని సీఎం చంద్రబాబు వివరించారు.

### ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సైతం దారి మళ్లింపు

"టీడీపీ ఐదేళ్లలో 72 శాతం పనులు పూర్తి చేస్తే...వైసీపీ 3.84 శాతం మాత్రమే పూర్తి చేసింది. దానికి తోడు నిధుల కొరత కూడా తీసుకొచ్చారు. టీడీపీ హయాంలో రాష్ట్ర నిధులు ఖర్చు చేసి రీయింబర్స్ చేయించాం...వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులు కూడా ప్రాజెక్టు కోసం ఖర్చు చేయకుండా రూ.3,385 కోట్లు దారిమళ్లించింది. టీడీపీ హయాంలో వచ్చిన గిన్నిస్ రికార్డుకు కేంద్రం కూడా ప్రశంసలు కురిపిస్తే..వైసీపీ హయాంలో నిపుణులు, పీపీఏ చివాట్లు పెట్టే పరిస్థితికి తీసుకొచ్చారు.

45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే...వైసీపీ ప్రభుత్వం 41.15 మీటర్లకు కుదించింది. రూ.55,548 కోట్లకు కేంద్రంతో ఆమోదం తెలిపేలా మేము కృషి చేస్తే...గత ప్రభుత్వం అసలు నిధులు కూడా అడగలేదు. నిర్వాసితులకు జగన్ ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశాడు. పరిహారం ఎకరాకు రూ.19 లక్షలు ఇస్తానన్నారు. పరిహారం అందిన వారికి కూడా రూ.5 లక్షలు అదనంగా ఇస్తానన్నారు.

పరిహారం ఇవ్వకపోవడమే కాకుండా నిర్వాసితుల జాబి తాలు మార్చి పరిహారం కాజేశారు. సకల వసతులతో కాలనీలు నిర్మిస్తానని చెప్పి ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. అధికారం, ఓట్ల కోసం ఎన్ని అబద్ధాలు చెప్పాలో అన్నీ చెప్పాడు. పునరావాసానికి రూ.4,114 కోట్లు టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసి మోడల్ కాలనీలు నిర్మిస్తే...వైసీపీ ప్రభుత్వం రూ.1687 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

### ప్రాజెక్టు పూర్తిపై పూటకో మాట

"పోలవరం ప్రాజెక్టు పూర్తిపై పూటకో మాట మాట్లాడారు. మొదటి సారి 2021 ఏప్రిల్ నాటికి, రెండో సారి 2021 డిసెంబర్ నాటికి, మూడో సారి 2022 ఏప్రిల్ నాటికి, నాలు గోసారి 2021 డిశంబర్ నాటికి..ఇక ఐదో సారి ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేం అని చేతులెత్తేశారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు ఇప్పుడు కేంద్రం అంతర్జాతీయ నిపుణులను ఆహ్వానించి ప్రాజెక్టు దుస్థితిపై అధ్యయనం చేయాల్సి వస్తోంది. హైడల్ ప్రాజెక్టు 2020 నాటికి పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ పూర్తికానందున ప్రభుత్వానికి రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. జగన్ నిర్లక్ష్యంతో డ్యామేజ్, రిపేరు పనులకు రూ.4,900 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటికే ప్రాజెక్టుపై 38 శాతం మేర ఖర్చులు పెరిగాయి.

టీడీపీ హయాంలో పోలవరం పనుల్లో అవినీతి జరగలేదని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పార్లమెంట్ లోనే సమాధానం ఇచ్చింది. మా ప్రభుత్వంలో అవినీతి జరిగిందని నిరూపించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. పిచ్చి కుక్క ముద్ర వేసి కుక్కను చంపినట్లు...మంచి ప్రాజెక్టుపై అవినీతి నెపం వేసి విధ్వంసం చేశారు." అని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

### జగన్ దుస్సాహసమే ప్రాజెక్టు నాశనానికి కారణం

"ఐదేళ్లు మేం పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీ రైంది. ప్రజలకు వాస్తవాలన్నీ తెలియకుండా దాచి పెట్టారు. కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్, గైడ్ బండ్ తో పాటు అన్ని చోట్లా సమస్యలు సృష్టించారు. ప్రజలంతా అర్థం చేసుకోవాలి. ప్రాజెక్టు సర్వనాశనానికి జగన్ దుస్సాహసమే కారణం. అర్హత లేని వాళ్లకు అధికారం ఇస్తే ఇలానే జరుగుతుంది. కొందరు ఆంబోతుల మాదిరిగా వచ్చి మమ్మల్ని తిట్టొచ్చు...విమర్శలు చేయొచ్చు. కాఫర్ డ్యాంకు, డయాఫ్రం వాల్‌కు తేడా తెలియకుండా...ప్రాజెక్టు వద్దకెళ్లి కాఫర్ డ్యాం ఎక్కడుందో వెతుక్కునే వ్యక్తులు విమర్శలు చేస్తున్నారు. కాఫర్ డ్యాం కూడా పర్మినెంట్ కాదు...నీటి డైవర్షన్ కోసమే కాఫర్ డ్యాం నిర్మాణం మూడునాలుగేళ్ల పాటు ఉంటుంది. మొదటి శ్వేతపత్రం రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంపైనే విడుదల చేశాం. ఇది పూర్తైతే పక్క రాష్ట్రాలకు కూడా నీరు ఇవ్వొచ్చు. తెలంగాణకు కూడా సాగర్ కాల్వ ద్వారా నీరందించవచ్చు.

రాయలసీమ బాగుండాలంటే నల్లమల అడవి గుండా టన్నెల్ ద్వారా బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరందించవచ్చు. కానీ ఇప్పుడు ప్రాజెక్టు పరిస్థితి చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది. కాఫర్ డ్యాం ద్వారా నీరు లీక్ అవుతోంది...దాన్ని పరిష్కరించకుండా పనులు ముందుకు సాగవు. ఇక్కడి ఇంజనీర్లు రిస్క్ తీసుకోవాలన్నా భయపడే పరిస్థితికి వచ్చారు. ప్రాజెక్టులో పైకి తెలిసిన డ్యామేజీ కంటే... తెలియని డ్యామేజీ చాలా ఉంది.

2021లోనే ప్రాజెక్టు దెబ్బతిన్నప్పటికీ 2022లో పూర్తి చేస్తాం, 2023 నాటికి పూర్తి చేస్తాం అని చెప్పారు. డయాఫ్రం వాల్‌కు కనీసం రెండు సీజన్ల సమయం పడుతుందని అధికారులు చెప్పినదాన్ని బట్టి తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి రావడానికి ప్రధాన దోషైన జగన్‌ను ప్రజలు ఇంటికి పంపారు.





డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్ పరిధిలో పది చొప్పున మొక్కలు నాటాలని పార్టీ నిర్ణయించింది.ఆ సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమ దృశ్యం.

# సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పి.వి.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఢిల్లీ,మహానాడు:

సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధాన మంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





# డయేరియా నివారణకు తక్షణమే స్పెషల్ డ్రైవ్

- మంచి నీటి పైప్ లైన్‌ల లీకేజిలను 24 గంటల్లో అరికట్టాలి
- రాష్ట్ర పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

అమరావతి,మహానాడు:

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకై అవసరమైన అన్ని చర్యలను చేపట్టేందుకు తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశిం చారు. మంచినీటి పైపుల్లో లీకేజిలు ఉంటే 24 గంటల్లో అరికట్టాలని, కాలువల్లో చెత్తాచెదారాన్ని జూలై మాసాంతాని కల్లా తొలగించాలని ఆదేశించారు.

అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దానికి తగ్గట్లుగా ముందస్తు నివారణ చర్యల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కమిషనర్లకు సూచించారు.

ఇప్పటి వరకూ మున్సిపాల్టీల్లో ఎక్కడా డెంగ్యూ కేసులు రాలేదని, అక్కడక్కడా డయేరియా కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. దీనిపై వైద్యారోగ్యశాఖ అధికారులతో కూడా చర్చించినట్లు మంత్రి తెలిపారు. డయేరియా నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, డ్రెయిన్ లలో సిల్ట్ తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. త్రాగునీటి సరఫరా పైపుల లీకేజీల నియంత్రణకు, కాలువల్లో చెత్తాచెదరాన్ని తొలగించి పారిశుద్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు దాదాపు రూ.50 కోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ సమావేశంలో పాల్గొన్న కమిషనర్లు.. వారి కార్పొరేషన్లలో అమలు చేయబడుచున్న పలు కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ల ఆర్ధిక పరిస్థితిని వివరించడంతో పాటు తాగునీరు సరఫరా మెరుగుకు, మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి, డ్రెయిన్ లలో మురుగు తొలగింపుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభి వృద్ధి శాఖ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఏపీ అర్బన్ ఫైనాన్సు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత, సిడిఎంఏ శ్రీధర్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఆనందరావు మరియు 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# ఎందుకీ కూల్చి'వేత'లు?

(మొదటిపేజీ తరువాయి..)

భావిస్తున్నాయి. అవే ఆఫీసులను ప్రభుత్వ కార్యాలయాలు, లేదా ప్రభుత్వ ఆసుపత్రులు, మంత్రుల క్వార్టర్లకు కేటాయిస్తే ప్రభు త్వానికి బోలెడు ఖర్చు ఆదా అవుతుందన్న సూచన వ్యక్తమవు తోంది. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో.. ప్రధాన కేంద్రాల్లో ప్రభుత్వానికి సొంత భవనాలు కరవవుతున్నాయి. విజయవాడ సహా జిల్లా కేంద్రాల్లో చాలా భవనాలకు ప్రభుత్వమే అద్దె



చెల్లిస్తోంది. ఇప్పుడు అనుమతులు లేకుండా వైసీపీ నిర్మించిన భవనాలను స్వాధీనం చేసుకుని, వాటిని ప్రభుత్వ భవనాలుగా మారిస్తే, ప్రభుత్వంపై ఆర్ధిక భారం తప్పుతుందని సూచిస్తు న్నారు.

కొన్ని జిల్లాల్లో అయితే.. వైసీపీ రాజభవనాలను తలదన్నేలా చేసిన నిర్మాణాలను 30 పడకల ఆసుపత్రులుగా మారిస్తే, రోగులకూ వెసులుబాటు ఉంటుందన్న సూచన వ్యక్తమవుతోంది.

కొత్త జిల్లాల నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీల క్యాంపు కార్యాలయాలకు భవనాలు లేకుండా పోయాయి. ఇప్పుడు వైసీపీ భవనాలను వాటికి వినియోగించినా, ఉపయోగంగా ఉంటుందని మరికొందరు సూచిస్తున్నారు. వైసీపీ ఏ శాఖ భూములు తీసుకుందో, ఆ శాఖ కార్యాలయాలు కూడా అందులో ఏర్పాటుచేసుకోవచ్చంటున్నారు. "ఎలాగూ అవి ప్రభుత్వ భూములే. నిర్మాణాలు పార్టీకి చెందినప్పటికీ భూమి ప్రభుత్వానిదే అయినందునఅక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, లేదా 30 పడకల ఆసుపత్రులు, అదీకాకపోతే ఎస్పీ-కలెక్టర్ల క్యాంపు ఆఫీసులుగా ఉపయోగించుకోవచ్చు" అని ఓ మాజీ మంత్రి సూచించారు.

అలాకాకుండా, వాటిని కూల్చివేసినందున ప్రజల్లో పార్టీ-ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందనన్నారు. జగన్ సీఎం అయిన వెంటనే ప్రజావేదికను కూల్చివేసిన వైనంపై, ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమయిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రజావేదికను కూల్చకుండా.. దానిని కలెక్టర్లు, ఎస్పీల సమా వేశాలకు వాడుకుంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమ యింది. జగన్ శాడిజంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేశారన్న విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే.

ఇప్పుడు తాము కూడా కూల్చివేతలు ప్రారంభిస్తే.. ఇటీవలి ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసిన తటస్థులు, విద్యావంతులు, మేధావుల దృష్టిలో, 'వైసీపీ-టీడీపీ విధానాలు ఒకటే'నన్న భావన ఏర్పడే ప్రమాదం ఉందంటున్నారు. దీనిపై విధాన నిర్ణయం తీసుకోవాలంటున్నారు. ఇప్పటికే వైసీపీ కార్యకర్తల ఆస్తులపై.. గ్రామస్థాయిలో జరుగుతున్న దాడులు, సోషల్‌మీడియాలో వైరల్ అవుతుండటంతో పార్టీ ఇమేజ్ డామేజీ అవుతోందన్న ఆందోళన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.'గతంలో వైసీపీ ప్రభుత్వంలో చేసిన అరాచకాలే టీడీపీ కూడా చేస్తే, అప్పుడు ఇద్దరికీ తేడా లేదన్న భావన్న భవిష్యత్తులో ప్రమాదం. దీన్ని కిందస్థాయి నుంచే అడ్డుకోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నష్టపోకతప్పదని" మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు.



3
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 29, జూన్ 2024




# ప్రతీ ఎకరాకు సాగునీరు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్,మహానాడు:**
పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పథకం ద్వారా ఖరీఫ్‌కు ప్రతి ఎకరానికి సాగు నీరు అందించాలని, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.
శుక్రవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఇరిగేషన్ అధికారులతో కలిసి కొల్లాపూర్ ప్రాంతంలోని నర్లాపూర్ వద్ద పాలమూరు ప్రాజెక్టు. పనులు, మాత్మ గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు.

అనంతరం ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కే ఎల్ఐ ద్వారా ఖరీఫ్ సీజన్లో రైతులకు ప్రతి ఎకరానికి సాగు నీరును అందించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రాజెక్ట్ కట్టడం ఎంత ముఖ్యమో ప్రతీ రైతు యొక్క పొలంలోకి సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యంమని, చివరి ఆయకట్టుకు సాగునీరందించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు కెనాల్స్ ను పరిశీలించి వారంరోజుల్లో పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కెనాల్స్ పూడిక, పిచ్చి మొక్కలను తొలగించేందుకు వ్యయ అంచనాలు రూపొందించి పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఫీల్డ్ చానల్స్ కు రైతులు సహకరించాలని సూచించారు. ఫీడల్ కెనాలను పూడ్చి వేస్తే సంబంధిత రైతులపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్దార్ తిప్ప ప్రాజెక్ట్ క్రింద ఉన్న ఆయకట్టుకు నీరందించడానికి బాచారం కాలువ సర్వే చేసి సాధ్యసాధ్యాలు పరిశీలించి నివేదికలను రూపొందించి ఇవ్వాలని మంత్రి సూచించారు.

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను త్వరగా పూర్తి చేయాలని, కృష్ణా జలాల నుంచి మన పూర్తిస్థాయి వాటాను ఉపయోగించుకివాలని ఆయన సూచించారు. మోటార్లు త్వరగా బిగించి, పనులు పూర్తి చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు.

నార్లాపూర్ నుంచి మిషీన్ భాగీరథి పనులు, పంప్ హౌస్ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టు కింద తమ ఇండ్లు కోల్పోయిన గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ద్వారా బోడబండ, సున్నపు తాండ, అంజనా గిరి తండ, ఒడ్డే గుడిసెలు, దుల్యానాయక్ తాండ పునరావాస గ్రామాలకు మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎల్లూరు నుంచి నార్లాపూర్ ఎల్లూరు నుంచి మొల చింతలపల్లి రహదారుల నిర్మాణానికి. ప్రతిపాదనలు రూపొందించి, త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి వెంట సీఈ విజయ భాస్కర్ రెడ్డి, ఎస్ఇ సత్యనారాయణ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, మురళీ, శ్రీకాంత్ , పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

# కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ కోసం దేనికైనా సిద్ధం

- రైతులు, ప్రజలతో పాటు ఉద్యోగాలు కోల్పోయిన 10 వేల మంది ప్రయోజనాల కోసం అవసరమైతే అదానీ కాళ్లు పట్టుకుంటాం. లేదంటే పోరాటానికి వెనుకాడం
- అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యానికి స్పష్టం చేసిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- కంటైనర్ టెర్మినల్ తరలిపోలేదని నోటికొచ్చినట్టు నన్ను తిట్టిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి కళ్లు కనిపించకపోతే కంటి డాక్టరుకు చూపించి చుక్కల మందు వేయిస్తామన్న సోమిరెడ్డి
- టీడీపీ, బీజేపీ, జనసేన, సీపీఐ నాయకులతో కలిసి పోర్టు సీఈఓ జీజేరావు, పీఆర్వో వేణుగోపాల్ తో భేటీ అయిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- టెర్మినల్ పునరుద్ధరణతో పాటు కూలీలకు కూలి పెంపు, ఉద్యోగుల వేతనాలు, పట్ట కట్టే కూలీల పెంపు తదితర అంశాలపై చర్చించిన సోమిరెడ్డి
- పోర్టు ప్రతినిధులతో సమావేశం అనంతరం కంటైనర్ టెర్మినల్ యార్డును పరిశీలించిన సోమిరెడ్డి, బీజేపీ, జనసేన, సీపీఐ నాయకులు
- కార్యకలాపాలు లేక బోసిపోతున్న టెర్మినల్ తో పాటు ఖాళీ కంటైనర్లను చూసి ఆవేదన వ్యక్తం చేసిన సోమిరెడ్డి



**కృష్ణపట్నం,మహానాడు:**
అదానీ కృష్ణపట్నం పోర్టును కూటమి నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.
ఈ సందర్భంగా సోమిరెడ్డి ఏమన్నారంటే.. కృష్ణపట్నం



పోర్టు కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణే మా లక్ష్యం.రైతులకు సంబంధించిన రొయ్యలు, చేపలు, మిర్చి, పొగాకుతో పాటు గ్రానైట్ తదితర ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి.తమిళనాడులోని పోర్టులకు ఆ ఉత్పత్తులను తరలించేందుకు రవాణా ఖర్చులు పెరగడంతో ధరలు తగ్గి ఆ నష్టప్రభావం కూడా రైతులపైనే పడుతోంది.

రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు సంబంధించిన రైతుల ఉత్పత్తుల ఎగుమతులను కిల్ చేసేశారు. కంటైనర్ టెర్మినల్‌ను తరలించేసి దుమ్ముతో కూడిన ఐరన్ ఓర్, బొగ్గును మన ముఖాన కొట్టారు.ఏపీ మారిటైం బోర్డు పర్యవేక్షణలో ఉన్న పోర్టు నుంచి కంటైనర్ టెర్మినల్ తరలిపోతున్నా అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి నోరు విప్పలేదు.

2019కి ముందు సీవీరావు పెత్తనంలో 10 లక్షల కంటైనర్ల ఎగుమతులు, దిగుమతులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.900 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు ఆదాయం వచ్చింది.సుమారు 12 వేల మంది పోర్టులోని కంటైనర్ టెర్మినల్‌పై ఆధారపడి జీవనం సాగించారు.ఇప్పుడు ఆ ఉద్యోగాలు పోయాయి. ఆదాయం కూడా లేకుండాపోయింది.

పోర్టు కోసం తాతముత్తాతలు ఇచ్చిన ఇళ్లు, భూములు, పొలాలను త్యాగం చేస్తే చివరకి దుమ్ము, దూళి మాత్రమే మిగిలాయి.సీవీ రావు హయాంలోనే 10 లక్షల కంటైనర్ల ట్రాన్స్ పోర్టు జరిగితే, ఇక అదానీ చేతికొచ్చింది కాబట్టి 20 లక్షల కంటైనర్లకు పోతుందని భావించాం.కానీ పోర్టు ఇలా మునిగిపోతుందని కలలో కూడా ఊహించలేదు.

వైజాగ్, ముంబై, చెన్నై పోర్టులతో పోటీపడిన కృష్ణపట్నం పోర్టుకు ఈ పరిస్థితి రావడం జీర్ణించుకోలేకపోతున్నాం. వేలాది రూపాయలు జీతాలతో ఉపాధి పొందిన ఈ ప్రాంత యువత ఈ రోజు కూలికిపోయే పరిస్థితి రావడం భరించలేకున్నాం. కంటైనర్ టెర్మినల్ మూసేసారయ్యా..అని జనవరి నుంచే మేం ఆవేదన వ్యక్తం చేయడంతో పాటు పోరాటం సాగిస్తూనే ఉన్నాం. ఆనాటి మంత్రి కాకాణి పోర్టుకు వచ్చి కంటైనర్ టెర్మినల్ మూతపడలేదని, సోమిరెడ్డికి కళ్లు పోయాయని నోటికొచ్చినట్టు మాట్లాడాడు.

ఇప్పుడైనా వచ్చి కంటైనర్ టెర్మినల్ చూడమనండి. కళ్లు కనిపించకపోతే డాక్టర్ కు చూపించి చుక్కలు మందు వేయిస్తాం. కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ టోలుగేటు తెరవడం, దౌర్జన్యాలు చేయడం తదితర కారణాలతోనే అదానీకి వళ్లు మండి టెర్మినల్‌ను తమిళనాడుకు తరలించేశారు. ఇప్పుడు సర్వేపల్లి నియోజకవర్గంలో పరిస్థితులు మారిపోయాయి.

ప్రపంచంలోనే అత్యంత ధనికుడైన అదానీకి ఈ పోర్టు టెర్మినల్ ను కొనసాగించడం చాలా చిన్నవిషయం. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏ సాయం కావాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని అభ్యర్థించి అందిస్తాం. బీజేపీ, జనసేనతో పాటు ఇతర పక్షాలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కూడా కలుస్తాం. ఎప్పుడు, ఎక్కడ అవకాశం ఇచ్చినా అప్పుడు అక్కడ అదానీని కలిసి మా గోడు వినిపిస్తాం.

గతంలో పోర్టు నిర్వాసిత రైతులకు పరిహారం పెంచేందుకు కూడా ప్రత్యేక బస్సులు వేసుకెళ్లి ఎన్టీఆర్, రాజశేఖర్ రెడ్డిలను కలిశాం..సమస్యలకు పరిష్కారాలు సాధించాం. రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నాం కానీ...పదవుల కోసం, అక్రమ సంపాదన కోసం ఏనాడు ఒక మెట్టు దిగలేదు.

కానీ పోర్టును నమ్ముకున్న మా ప్రాంత ప్రజలు, రైతులు, ఉద్యోగాలు కోల్పోయిన యువత కోసం అవసరమైతే అదానీ కాళ్లు పట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. కంటైనర్ టెర్మినల్ ను కృష్ణపట్నం పోర్టులో పునరుద్ధరించకపోతే ఏ పోరాటానికైనా సిద్ధం..ప్రాణాలిచ్చేందుకు కూడా వెనుకాడం.

మంచి మనస్సు చేసుకుని పోర్టులో కంపెనీలన్నీ కార్యకలాపాలు తిరిగి కొనసాగించి పోర్టుకు పూర్వవైభవం తేవాలని కోరుతున్నాం.పోర్టులో సుమారు 1000 మంది మహిళలు రోజుకు 9 గంటల పాటు కూలి పనిచేస్తున్నారు.వారికి రోజుకు రూ.250 కూలి ఇస్తున్నారు. అందులో రూ.50 చార్జీలకు పోతే వారికి మిగులుతోంది రూ.200 మాత్రమే.

కూలీలకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి కనీసం రూ.350 కూలి చెల్లించాలని కూడా పోర్టు సీఈఓకు విన్నవించాం. ట్రక్కులకు పట్ట కప్పే వారికి రూ.150 ఇవ్వాలని, డైనింగ్ హాల్ తో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి జీతాలు కనీస వేతన చట్టం ప్రకారం పెంచాలని కోరాం.




# సెప్టెంబర్ 21న 203 అన్న క్యాంటీన్లు ప్రారంభం

- ప్రజలకు ఇబ్బంది లేని విధంగా భవనాలకు అనుమతులు ఇవ్వాలి
- నుడా పరిధిలో లే అవుట్ల అనుమతుల ఆరోపణలపై కమిటీ ఏర్పాటు
- పట్టణ మహిళల ఆర్థిక పరిపుష్టికి మెప్మా తగిన చర్యలు చేపట్టాలి
- ప్రతి రోజూ తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షించండి
- పురపాలక - పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి పొంగూరు నారాయణ కీలక ఆదేశాలు

**విజయవాడ,మహానాడు:**
పురపాలక – పట్టణాభివృద్ధి శాఖలోని పలు విభాగాల శాఖాధిపతులు,సీనియర్ అధికారులతో మంత్రి నారాయణ సమీక్షా మా వేషం నిర్వహించారు.. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ సింఘాలతో కలిసి విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో పలు కీలక అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

### అన్న క్యాంటీన్లు

రాష్ట్రంలోని 203 అన్న క్యాంటీన్‌లను వంద రోజుల్లోగా తిరిగి ప్రారంభించేలా ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిందన్న మంత్రి నారాయణ... సెప్టెంబర్ 21వ తేదీ నాటికి అన్న క్యాంటీన్లు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో నిర్మాణం పూర్తయి చిన్నచిన్న రిపేర్లు ఉన్న 183 క్యాంటీన్ల భవనాల మరమ్మత్తులకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

నిర్మాణాలు పూర్తి కావలసిన మరొక 20 అన్న క్యాంటీన్ భవనాలకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయడంతోపాటు ఆహారం సరఫరా చేసేందుకు అవసరమైన సర్వీస్ ప్రొవైడర్ ను టెండర్ల ద్వారా ఎంపిక చేయాలని ఆదేశించారు. పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ కోసం కమిటీ నియమించాలని సూచించారు.

### పట్టణాభివృద్ధి సంస్థలకు కీలక ఆదేశాలు

పట్టణాభివృద్ధి సంస్థల ఆర్థిక పరిస్థితుల గురించి వివరాలు తీసుకున్న మంత్రి నారాయణ... రెవిన్యూ పెంపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్ పరిధిలో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెన్సీలు,డెవలపర్లు కచ్చితంగా నిబంధనలను పాటించేలా చూడాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న నిబంధనలను అధ్యయనం చేయాలని పట్టణ ప్రణాళికా శాఖ డైరెక్టర్‌కు నారాయణ సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా భవనాల అనుమతుల విషయంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో లేఅవుట్ల అనుమతుల విషయంలో వస్తున్న ఫిర్యాదులపై కమిటీ నియమించారు.

### మెప్మా

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పట్టణాల్లోని మహిళలకు ఆర్థిక స్వావలంబన తీసుకొచ్చే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మెప్మా అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. పట్టణాల్లో మహిళలను అన్ని రంగాల్లోపైకి తీసుకొచ్చే విధంగా వారి జీవనోపాధికి ఎలాంటి కార్యక్రమాలు రూపొందించవచ్చు అనే దానిపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మెప్మా డైరెక్టర్‌కు సూచించారు.

### నీటి సరఫరా, డ్రైన్లలో పూడికతీతపై సూచనలు

రోజువారీగా కాలువల డీసిల్టింగ్‌ను పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఉపయోగించాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. సరైన క్లోరినేషన్ చేసిన తర్వాత తాగునీటి సరఫరా చేయాలని, మంచినీటి సరఫరా లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.నీటి సరఫరా నమూనాలు ప్రతిరోజూ నాణ్యత కోసం పరీక్షించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# ప్రజలు సమయమిస్తే మళ్లీ పూర్వవైభవం

- ఐదేళ్లు ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ
- రాజ్యాంగాన్ని విధ్వంసం చేసిన కాంగ్రెస్
- వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




**విజయవాడ, మహానాడు:**
రాష్ట్ర ప్రజలంతా ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తే ఖచ్చితంగా గత వైభవం వస్తుందని... అభివృద్ధికి చిరునామాగా ఏపీ నిలుస్తుం దని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి 16 రోజులే అయిం దన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని 20 తరాలకు కూడా సరిచేయలేనంతగా నష్టం కలిగించారని– ఆ ఫలితాలు చాలా దారుణంగా కనిపిస్తున్నాయని ఆవేదన చెందారు. రాష్ట్రం మళ్లీ గాడిలో పడుతుందని చెప్పారు.

విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 1975 జూన్ 25 నాటి ఎమర్జన్సీ సమయంలో జరిగిన యదార్థ సంఘటనలపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. అత్యవసర సమయంలో వివిధ కారణాలతో అరెస్టు అయిన వారిని ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ సత్కరించారు.

అనంతరం ఆయన ప్రసంగించారు. ఏ రాష్ట్రంలో అయినా అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు, రాజ్యాంగ ఉల్లంఘన జరిగినప్పుడు, ప్రజలకు తీవ్రమైన నష్టం వాటిల్లినప్పుడు వినియోగించాల్సిన ఆర్టికల్ 356ను దాదాపు 60 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 115 సార్లు విధించి... తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను కుప్పకూల్చిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఆర్టికల్ 356ని విధించలేదని... ఆ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనువణువు ఒంటబట్టించుకున్న భాజపా ఆ విలువలకు కట్టుబడిందన్నారు.

అత్యసర పరిస్థితుల సమయంలో పత్రికా స్వేచ్ఛను పూర్తిగా హరించేశారని– కానీ ఈనాడు వంటి పత్రికలు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడాయని అన్నారు. ఈనాడు వ్యవస్థాపకులు రామోజీ రావు ప్రజల్ని చైతన్య పరచడంలో ఇంటి ముఖం చూడకుండా... ఒత్తిళ్లకు తలగ్గొకుండా పనిచేశారని కొనియాడారు.

చీకటి రోజులకు కారణమైన కాంగ్రెస్ రాజ్యాంగం గురించి మాట్లాడుతోందని విమర్శించారు. అత్యవసర కాలంలో ప్రజలు, ముఖ్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో దేశభక్తులు చేసిన పోరాటం రెండో స్వాతంత్ర పోరాటమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

మన రాష్ట్రంలో గత ఐదేళ్లూ అప్రకటిత ఎమర్జన్సీలాగా పాలన సాగిందన్నారు. ప్రభుత్వ నిధులు దారిమళ్లింపు వద్ద నుంచి నోరెత్తిన వారిని జైల్లో పెట్టడమే సరిపోయిందన్నారు. తన శాఖ పరిధిలోనే ఆరు వేల కోట్ల రూపాయల వరకు వైకాపా ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదన్నారు. దేశంలో కొంతమంది కాలం చెల్లిన సిద్ధాంతాన్ని పట్టుకొని వేలాడుతున్న కమ్యూనిస్టు నాయకులు కాంగ్రెస్ మోచేతి నీళ్లు తాగే వాళ్ళు నిజం నిజం నిజం నిజం అంటూ కాంగ్రెస్ విమర్శలను సమర్థించారంటూ సత్యకుమార్ విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చింది కాంగ్రెస్ నాయకులయితే బిజెపిపై అసత్య ప్రచారం చేశారు. అత్యంత చీకటి రోజు ఇవాళ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్న వాళ్లంతా అధికారం చేతిలో ఉంటే అణిచివేయడం ఎంత కాలం ఒక క్షణం పట్టదు అని చెప్పి పాఠం నేర్పిన కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర పోరాటంగా పరిగణించబడ్డ కాలంలో ఎమర్జెన్సీ కాలంలో ప్రజలు చేసిన పోరాటం ముఖ్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో దేశభక్తులులో కలిసి చేసిన పోరాటం రెండో స్వాతంత్ర పోరాటమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

లేదంటే చరిత్రలో లిఖించదగ్గ ఆ కాలం గురించి మనం మననం చేసుకోవాలి ఆ సందర్భం గురించి ఆ సమయం గురించి ఆ తర్వాత జరిగిన అరాచకాల గురించి ఏ రకంగా ప్రజల శ్రేష్టమైన పౌర హక్కులను కాలరాచారు జయప్రకాష్ నారాయణ లాంటి వారిని అరెస్టు చేశారు.ఆర్గనైజర్ ఎడిటర్ కెఆర్ మాల్కానీ అరెస్టు, ఇండియన్ ఎక్స్ ప్రెస్ అదినేత రామ్ నాద్ గోయాంకా లాంటి వారిని అరెస్టు చేశారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ప్రియాంబుల్ ను మార్చి వేసిన ఘనత కాంగ్రెస్‌ది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్‌అనేక సార్లు మార్చి వేసింది. ఈ విధంగా ఆనాటి పరిస్థితిలను వివరించారు మంత్రి సత్యకుమార్ మన రాష్ట్రంలో గత అయిదు సంవత్సరాలు అప్రకటిత ఎమర్జన్సీలాగా సాగింది.

ప్రభుత్వ నిధులు దారిమళ్లింపు దగ్గర నుండి నోరెత్తిన వారిని జైల్లో పెట్టడమే సరిపోయింది పాలన గాడిలో పెట్టడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కొంత సమయం ఇవ్వాలన్నారు. విశ్వనాయకుడు నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.

సిద్దార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణ రావు, ఆర్ ఎస్ ఎస్ నాయకులు కోనేరు దుర్గా ప్రసాద్, అడ్డూరి శ్రీ రాం తదితరులు ప్రసంగించారు. బిజెపి సీనియర్ నేత కిలారు దిలీప్ సదస్సు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 29, జూన్ 2024

# అక్షరాల గుడిలో.. భువనమ్మ ఒడిలో..

- చల్లపల్లి ఎన్టీఆర్ మోడల్ స్కూలులో భావోద్వేగాలు
- 400 మందికి పైగా అనాథలు, పేదపిల్లలను చదివిస్తోన్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి
- పిల్లలతో భోజనం చేసి, యోగక్షేమాలు తెలుసుకున్న భువనమ్మ

చల్లపల్లి,మహానాడు:

పేదపిల్లలకు అదో అక్షరాల గుడి.. తల్లిదండ్రుల్లేని అనాథలకు ఆదరించే అమ్మ ఒడి.. అదే చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథలు, పేద పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి కల్పించే అక్షరాలయం ఎన్టీఆర్ మోడల్ స్కూల్. సుమారు 400 మందికి పైగా విద్యార్థులకు అమ్మానాన్న అన్నీ అయి చదివిస్తోంది భువనమ్మ. చాలా రోజుల తరువాత పిల్లల మధ్య మహాతల్లి భువనమ్మ ఆనందంగా గడిపారు.









మహానాయకుడు ఎన్టీఆర్ కుమార్తెగా, దార్శనికుడు చంద్రబాబు సతీమణిగా, యువగళం నారా లోకేష్ మాతృమూర్తిగా మనందరికీ పరిచయం నారా భువనేశ్వరి. ఆంత్రప్రెన్యూర్‌గా హెరిటేజ్‌ని విజయపథంలో నడిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా సేవాస్ఫూర్తిని చాటారు. విద్య,వైద్య రంగాల్లో.. పేద పిల్లలకు సాయం అందించడంలో భువనేశ్వరి సాటిలేని మేటి. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితుల్ని ఆదుకోవడంలో ముందుండేలా ఎన్టీఆర్ ట్రస్ట్‌ని నిలిపారు. బ్లడ్ బ్లాంక్, ఎన్టీఆర్ స్కూల్స్ ద్వారా సేవాప్రస్థానం అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు.

తండ్రి సీఎంగా ఉన్నా, భర్త సీఎంగా ఉన్నా..కొడుకు మంత్రిగా ఉన్నా ఏనాడూ రాజకీయాల్లో కనిపించని భువనేశ్వరి.. తన భర్త అక్రమ అరెస్టుని నిరసిస్తూ, నిజం గెలవాలి అంటూ రాష్ట్రమంతా పర్యటించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లోనూ కూటమి తరఫున విస్తృత ప్రచారం చేశారు.

ఈ బిజీ షెడ్యూల్ వల్ల ఎన్టీఆర్ స్కూలుని సందర్శించలేక పోయారు. పిల్లల్ని చూడాలనే ఆరాటంతో శుక్రవారం చల్లపల్లి ఎన్టీఆర్ మోడల్ స్కూలుని భువనమ్మ సందర్శించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బందితో ఆత్మీయంగా మాట్లాడి ఫోటోలు దిగారు. పిల్లలందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ హత్తుకున్నారు. సౌక ర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. అమ్మ ఒడిని చేరిన పిల్లల తీరుగా అందరూ భువనమ్మని చుట్టుముట్టారు. అల్లుకుపోయారు. వారితోనే భోజనం చేశారు. చక్కగా చదువుకుని ఎన్టీఆర్ స్కూలు విద్యార్థులమని గర్వంగా చాటిచెప్పాలని ఉద్బోధించారు. చాలారోజుల తరువాత హాయిగా, నవ్వుతూ పిల్లలతో కాలక్షేపం చేసి.. అపరిమిత ఆనందంతో పిల్లలకు వీడ్కోలు పలికారు భువనమ్మ. ఈ పర్యటనలో ఎన్టీఆర్ ట్రస్ట్ సీ.ఓ.ఓ గోపి అడుసుపల్లి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.





# పవన్ కళ్యాణ్.. బిజీబిజీ

- ఇటు శాఖల సమీక్షలు చేస్తూ.... అటు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ..
- అధికారులతో శాఖలవారీగా సమీక్షలు
- ప్రజల నుంచి స్వయంగా వినతుల స్వీకరణ
- శుక్రవారం బిజీబిజీగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మంగళగిరి,మహానాడు:

ఒక వైపు తనకు సంబంధించిన శాఖలపై సమీక్షలతో బిజీబిజీగా ఉంటూనే... మరోవైపు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాధాన్యత ఇస్తున్నారు.

శుక్రవారం మంగళగిరి కేంద్ర కార్యాలయానికి సమస్యలతో ప్రజలు పోటెత్తడంతో స్వయంగా పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగారు. జనసేన పార్టీ కార్యాలయానికి వినతులు తీసుకొని వచ్చిన బాధితులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి వారి నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి తగు హామీలను ఇచ్చారు. బాధితులు చెప్పిన కొన్ని సమస్యలు ఇవి...

ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నుంచి 1143 ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది కోరారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో తాము బోధనలో ఉన్నామని తెలిపారు. 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు వచ్చేలా చూడాలని, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ వ్యవస్థకు కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ అని పేరు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలోనే డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయుల నియామకం కూడా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నిరుద్యోగ ఉపాధ్యాయుల సంఘం కోరింది. 1986 నుంచి ఈ పోస్టులు భర్తీ



చేయడం లేదని విన్నవించింది.

ప్రమాదవశాత్తు ఇళ్లు కాలిపోవడం వల్ల తన కుమార్తె సర్టిఫికెట్లతో పాటు ఆమె చదువుకోసం దాచిపెట్టిన డబ్బులు కాలిపోయాయని ముమ్మిడి మహేశ్వరి అనే మహిళ కన్నీరు పెట్టుకున్నారు. తమ కుమార్తెను చదువులకి సాయం అందించాలని కోరారు.

పలువురు దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకునేందుకు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. వారందరి దగ్గర నుంచి పవన్ కళ్యాణ్ వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# తెలుగుదేశం నూతన సారధి.. సమన్వయ వారధి

- ఏపీ టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకి మంత్రి లోకేష్ అభినందనలు

మంగళగిరి,మహానాడు:

ఏపీ టిడిపి నూతన అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావు తెలుగుదేశంపార్టీకి- ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, ప్రజాసంక్షేమానికి కృషి చేయాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు.

టిడిపి కేంద్ర కార్యాలయం మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నూతన అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడిగా బీసీ నేత పల్లా శ్రీనివాసరావుని ఎంపిక చేయడం తెలుగుదేశం పార్టీ బీసీలకు ఇచ్చే ప్రాధాన్యతకు మరో నిదర్శనం అని పేర్కొన్నారు. నేతలు-కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ



పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరుతూ మంత్రి లోకేష్ నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.









# బీసీలకు టీడీపీ పెద్దపీట

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన పల్లాశ్రీనివాసరావు
- టీడీపీ కోసం ఏమి ఆశించకుండా పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం
- కార్యకర్తలు ఏ సమస్య ఉన్న పార్టీ కార్యాలయానికి వచ్చి విన్నవించుకోవచ్చు
- ప్రతి కార్యకర్త సమస్య పరిష్కారానికి కృషి చేస్తా
- పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలి
- త్వరలోనే టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసుల తొలగింపు కృషి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

మంగళగిరి,మహానాడు:

టీడీపీ అంటే బీసీలు... బీసీలు అంటే టీడీపీ అని మరోసారి సీఎం చంద్రబాబు రుజువు చేశారు. టీడీపీకి వెన్నెముకగా ఉండే బీసీలకు పెద్ద పీట వేస్తూ... టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీ నేత గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అప్పగించడంపై బీసీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేడు మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షపదవిని కార్యకర్తల సమక్షంలో గౌరవ ప్రదంగా స్వీకరించారు. నేతలు, నాయకులు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబుకు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఎంతో గురుతర బాధ్యతను అప్పగించారని ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పదవీ బాధ్యతలను నిర్వహిస్తానని తెలిపారు.

పవిత్రమైన సంకల్పంతో నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టికి తనను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అధినేత తనకు దిశానిర్దేం చేసిన విషయాలను తూచ తప్పకుండా.. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించేలా.. నామినేటెడ్ పదవులతో ప్రభుత్వంతో భాగస్వామ్యం చేసి ముందు తీసుకెళ్లడమే తన ప్రధానమైన బాధ్యతగా తెలిపారు.

పార్టీని అధికారంలోకి తీసుకు రావాడనికి ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా... వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా వాటిని ఓర్చుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అధినాయకుడి ఆదేశాలను ముందుకు తీసుకెళ్తూ కృషి చేసిన కార్యకర్తలను గుర్తించాల్సిన అవసరం ఉంది. అధికారంలోకి వచ్చిన తరువాత పాలనవ్యవస్థలో నిమగ్నమై నాయకులు కార్యకర్తలను పట్టించుకోవడంలేదన్న ఆలోచన వారిలో ఉంది. అటువంటి విమర్శకు తావులేకుండా పార్టీని నాయకులును ప్రభుత్వాన్ని సమన్వయం చేసు కుంటూ 2029కి ఇదే మెజార్టీతో గెలిచేలా కృషి చేస్తానన్నారు.

రాష్ట్రంలో ఉన్న ప్రతి టీడీపీ కార్యకర్తకు తెలియజేసేది ఒక్కటే.. మేము అనుక్షణం మీతోనే ఉంటాం.. మీ బాధ్యత మాది అని పల్లా అన్నారు. నేడు ఎంతో మంది కార్యకర్తలు ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఏమి ఆశించకుండా పార్టీ కోసం వారి సమయాన్ని చంద్రబాబు సిద్ధాంతాలను ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషిచేశారు.

నేను మీకోసమే ఈ పదవిని తీసుకున్న.. కార్యకర్తలకు న్యాయం చేయకుంటే నేను నా పాత్ర సక్రమంగా చేయనట్లు భావిస్తా... ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా... ఏ పని ఉన్నా పార్టీ కార్యాలయానికి వస్తే ఖచ్చితంగా మీ సమస్యకు పరిష్కారానికి కృషి చేస్తా. ప్రతి నాయకుడు కూడా ఆలోచించాలి. అధికారం ఉందని ప్రజాస్వామ్యానికి విఘాతం కలింగించేలా వ్యవహరించకూడదు. మనమందరం ప్రజాస్వామ్యవాదులం. మన మూలాలు ప్రజాస్వామ్యం.

గత ప్రభుత్వం అధికారాన్ని అపహాస్యం చేస్తూ... ప్రతిపక్ష నేతలపై కేసులు పెడుతూ.. కేవలం ప్రతిపక్ష నేతలను అనగతొక్కడానికే అధికారాన్ని వినియోగించారు. అందుకే వైసీపీకి బుద్ధి చెప్పి ప్రజలు ఇంటికి పంపించారు. ఇవి దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రయోజనాలకోసం పనిచేయాలి.

రాజకీయ ప్రేరేపిత కేసులను మూడు నెలల్లో తీయించేలా కృషి చేస్తాం. ఎఫ్ఐఆర్ అయ్యి కోర్టులో ఉన్న రాజకీయ ప్రేరేపిత కేసులను సంత్సరంలో తొలగించేలా కృషి చేస్తాం. ప్రతి నాయకుడు కూడా ఏ నాయకుడు మీద కేసులు ఉన్నాయో పార్టీ దృష్టికి తీసుకు రావాలి.

మనం వారి లెక్క తేల్చాల్సిన అవసరం ఉంది. చట్టాలకు అనుగుణంగా అధికారం దుర్వినియోగం చేసిన వారికి బుద్ధి చెబుతాం. నేడు ప్రజలు చంద్రబాబు నాయుడు యొక్క కష్టాన్ని చూసి యువనాయకుడు లోకేష్ యొక్క యవగళాన్ని చూసి కూటిమిలోని నాయకులు సహాయ సహకారాలు చూసి అధికారం ఇచ్చారు. మనం ఈ ఐదు సంవత్సరాలు అన్ని వర్గాలకు న్యాయం చేసేలా కృషి చేయాలి. ముఖ్యంగా బలహీన వర్గాలను, వెనకబడిన వర్గాలను, అనగారిన వర్గాలను సమసమాజం వైపు నడిపించాల్సిన అవసరం ఉంది. వారికి రాజకీయ ప్రాధాన్యతను కల్పించాల్సిన అవసరం ఉంది. సామాజిక సమతుల్యతను చూసుకుని ముందుకు వెళ్దాం.

పార్టీ బలోపేతానికి యువనాయకత్వాన్ని ఆహ్వానించాలి. యువనాయకత్వాన్ని ప్రోత్సహించాలి. మన మనుగడ ఉండాలంటే యువత మనతో అడుగులు వేయాలి. యువతను ఆకర్షించాలి. లోకేష్ బాబు ఆలోచనలను గౌరవించాలి. సీనియర్ నేతలకు సముచిత స్థానం కల్పిస్తూనే యువతను ప్రోత్సహించాలి. యువనాయకత్వం చట్ట సభల గురించి తెలుసుకోవాలి. చట్టసభల్లో చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. నాయకుడు సమాజ గమనాన్ని గుర్తించాలి. దాన్ని గమనాన్ని సరైన మార్గంలో పెట్టాలి.

అన్న ఎన్టీఆర్ టీడీపీ పార్టీ పెట్టాకే బడుగు బలహీన వార్గాలకు రాజకీయ ప్రాధాన్యత దక్కింది. సమసమాజ స్థాపన జరిగింది. ఉద్యోగ అవకాశాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, మానవ వనరుల అభివృద్ధి, భవిష్యత్ తరాల బాగుకోసం పరితపించే చంద్రబాబు ఆశయాలకనుంగా పనిచేయాలి. ఇంట్లో కూర్చుంటే సరిపోదు నాయకత్వం రావాలంటే అనుక్షణం ప్రజల్లో ఉండాలని సుమారు 3 వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకున్న టీడీపీ జాతీయ ప్రదాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ నుండి యువత నాయకత్వ విలువలను నేర్చుకోవాలి. అప్పుడే ప్రజల ఆశీర్వాదం దొరుకుతుంది. గత దుర్మార్గపు పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైంది. ఈరాష్ట్రాన్ని మళ్లీ పునర్నిర్మాణం చేసుకోవాలి. పోలవరంతోపాటు, అమరావతి, ఆర్థిక రాజధానిగా విశాఖ, రాయలసీమలను అభివృద్ధి చేసుకోవాలి. అధినాయకత్వంతో మమేకమై రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు అందరికి కృతజ్ఞతలు, దన్యవాదాలు తెలుపుతున్న.

# మహానాడు

జనం గుండె చప్పుడు

5

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 29, జూన్ 2024


పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, గల్లా జయదేవ్





## బాబుతో మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ భేటీ

- ఎయిమ్స్ సమస్యలను సిఎంకు వివరించిన డైరెక్టర్ డా.మధబానందకర్
- సాధ్యమైనంత త్వరలో సమస్యలు పరిష్కారం చేస్తామని ముఖ్యమంత్రి హామీ

అమరావతి,మహానాడు:

మంగళగిరి ఎయిమ్స్ ను దేశంలో టాప్-3 స్థానంలో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.1,618 కోట్ల కేంద్ర నిధులతో ఎయిమ్స్ ఏర్పాటు అయ్యింది. ఎయిమ్స్ నిర్మాణానికి అవసరమైన భూములు, అనుమతులు ఇచ్చి నాటి తెలుగుదేశం ప్రభుత్వం వేగంగా పనులు పూర్తి చేసింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరవాత ఈ ప్రతిష్టాత్మక సంస్థను సమస్యలు చుట్టుముట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన చేయూత ఇవ్వకపోవడం, మౌళిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఎయిమ్స్ సమస్యల భారిన పడింది.

సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఎయిమ్స్ డైరెక్టర్ డా.మధబానందకర్ సంస్థ సేవలపై వివరించారు. ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా తీవ్ర నీటి కొరతతో సేవలను విస్తరించలేక పోతున్నాం అని తెలిపారు. నీటి సమస్య పరిష్కారం కోసం తలపెట్టిన పైప్ లైన్ పనులు కూడా ఆగిపోయాయని తెలిపారు. రోజుకు 7 ఎఎల్ డి నీరు అవసరం పడగా...ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా కేవలం 2 ఎంఎల్ డి నీరు మాత్రమే అందుబాటులో ఉంటుందని డైరెక్టర్ వివరించారు.

అటవీ భూమిగుండా పైప్ లైన్ నిర్మాణం విషయంలో సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. అదే విధంగా విద్యుత్ సరఫరా విషయంలో కూడా ఉన్న సమస్యలు సిఎం దృష్టికి తెచ్చారు. 192 ఎకరాలకు గాను 182 ఎకరాలు సంస్థ కోసం ఇచ్చారని....మరో 10 ఎకరాలు ఇస్తే ఎయిమ్స్ విస్తరణ పనులు చేస్తామని సిఎంకు డైరెక్టర్ వివరించారు. ఎయిమ్స్ లో అందుతున్న సదుపాయాలపై ఒకసారి వచ్చి పరిశీలించాలని సీఎం చంద్రబాబు నాయుడుని డైరెక్టర్ ఆహ్వానించారు.

ప్రతిష్టాత్మక ఎయిమ్స్ సమస్యల వలయంలో చిక్కుకుపోవడంపై సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో దీనిపై పూర్తి స్థాయి సమీక్ష చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

5 ఏళ్ల పాటు గత ప్రభుత్వం కనీసం నీటి సమస్య తీర్చకపోవడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. సాంకేతిక, ఆర్థిక సమస్యలతో ఎయిమ్స్ కు తాగునీటి సరఫరా చేసే పనులు నిలిచిపోవడం సరికాదని సీఎం అన్నారు. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు.



## గడ్కరీతో మల్కాజిగిరి ఎంపీ ఈటల భేటీ

ఢిల్లీ,మహానాడు:

తన నియోజకవర్గంతోపాటు.. తెలంగాణలో నెలకొన్న వివిధ సమస్యలపై మల్కాజిగిరి బీజేపీ ఎంపి నితిన్‌గడ్కరీతో చర్చించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఈటల ఏమన్నారంటే.. కొంపల్లి ఫ్లై ఓవర్లు అండర్ పాస్, నత్తనడక నడుస్తున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్ పేట రోడ్డు, Lb నగర్ అండర్ పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించాము.



హైదరాబాద్‌లో నిర్మించేవి అన్నీ అండర్ పాస్‌లు కాకుండా ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని కోరాము. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లిలో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరాం. సమగ్రంగా మరో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు రూ.50 కోట్లతో ప్రత్యేక డ్రైవ్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

అమరావతి,మహానాడు:

వర్షాకాలంలో పట్టణ ప్రాంతాల్లో ఎటు వంటి సీజనల్ వ్యాధులు ప్రభల కుండా ఉండేందుకై ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. దాదాపు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో త్రాగునీటి సరఫరా పైపుల లీకేజీల నియంత్రణకు, కాలువల్లో చెత్తాచెదరాన్ని తొలగించి పారిశుద్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు ఈ డ్రైవ్ లో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో మంత్రి సమావేశమై కార్పొరేషన్ల వారీగా ఆర్థిక స్థితిగతులను, పారిశుద్య పరిస్థితుల మెరుగుకు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.

అనంతరం పబ్లిసిటీ సెల్‌లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు ఉన్నాయని, వాటిలో 17 కార్పొరేషన్లు, 24 నగర పంచాయితీలు మరియు 72 మున్సిపాలిటీలు ఉన్నట్లు తెలిపారు. నేడు 17 కార్పొరేషన్ల కమిషనర్లతో సమీక్ష నిర్వహించడం జరిగిందని, సోమవారం నగర పంచాయితీల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

నేడు కమిషనర్లతో జరిగిన సమీక్షా సమావేశంలో మున్సిఫల్ ప్రాంతాల్లో త్రాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకై పైపుల లీకేజీని 24 గంటల్లో అరికట్టాలని, కాలువల్లో చెత్తాచెదరాన్ని జూలై మాసాంతాని కల్లా తొలగించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.



గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు త్రాగు నీరు అందించడంతో పాటు ముగునీటి పారుదల పైపులు, ముగురు నీటి శుద్ధి ప్లాంట్లు, వరద నీరు పారుదల కాలువలు ఏర్పాటు పనులను చేపట్టడం జరిగిందన్నారు. దీనికోసం ఏషియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు ద్వారా రూ.5,350 కోట్లు కేటాయించామన్నారు. అయితే ఈ నిధుల్లో గత ప్రభుత్వం కేవలం రూ.429 కోట్లను మాత్రమే వెచ్చించి మిగిలిన నిధుల వినియోగానికి రాష్ట్ర వాటాను కేటాయించకుండా నిరుపయోగంగా వదిలేసిందన్నారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తి అయి ఉంటే కనీసం 50 శాతం మున్సిపాలిటీల్లో త్రాగునీటి సమస్య ఉండేది కాదన్నారు. ఈ నెలాఖరు కల్లా ఆ ప్రాజక్టు అమలు గడువు కూడా ముగియనుందన్నారు. ఈ ప్రాజెక్టు క్రింద మిగిలిన నిధులను ఉపయోగించుకునేందుకు ప్రాజెక్టు కాలపరిధిని పెంచాలని కోరుతా ఏషియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు కు లేఖ వ్రాయం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు క్రింద మిగిలిన నిధులను అన్నింటినీ వినియోగించుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తామన్నారు.

లక్ష లోపు జనాభా ఉన్న నగర పంచాయితీల్లో మౌలిక వసతుల మెరుగుకు అమృత-I&II ప్రాజక్టులను తమ ప్రభుత్వ హయాంలో చేపట్టగా, గత ప్రభుత్వం ఆ ప్రాజక్టులను కూడా నీరుగార్చిందన్నారు. అమృత-I పథకం క్రింద కేటాయించిన నిధులు రూ.3,362 కోట్లలో కేవలం రూ.2,213 కోట్లను మరియు అమృత-II పథకం క్రింద కేటాయించిన నిధులు రూ.8,078 కోట్లలో కేవలం రూ.360 కోట్లను మాత్రమే గత ప్రభుత్వం వెచ్చించి మిగిలిన నిధుల వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకుండా, మున్సిఫాలిటీలకు వచ్చే నిధులను ఇతర పథకాలకు మళ్లించడం జరిగిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి ఈ పథకాల పునరుద్దణకు రాష్ట్ర వాటాని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగానున్న అన్ని పట్టణ ప్రాంతాల్లో చెత్తను ఎక్కువగా వేసే దాదాపు 20 వేల బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిని గ్రీన్ స్పాట్లుగా మార్చేందుకు రాష్ట్ర కార్యాలయంలో డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షించడం జరిగేదన్నారు.

అయితే ఆ వ్యవస్థను కూడా గత ప్రభుత్వం నీరుగార్చిందని, ఆ వ్యవస్థను రానున్న వారం రోజుల్లో పునరుద్దరించి రాష్ట్ర వ్యాప్తంగా నున్న బ్లాక్ స్పాట్లను అన్నింటినీ గ్రీన్ స్పాట్లుగా మారుస్తామన్నారు. ఏషియన్ డవలెప్మెంట్ బ్యాంకు ఆర్థిక సహాయంతో మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో త్రాగునీరు, వరద నీటి పారుదల ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందని, ఆ పనులు త్వరలో పూర్తి కానున్నట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో వచ్చే వందరోజుల్లో 203 అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని, విజయనగరం, సాలూరు ప్రాంతాల్లో స్థలాల సమస్యను కూడా పరిష్కరించడం జరిగింది మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో దేశంలోనే ఆదర్శంగా ఉండేవిధంగా టిడ్కో గృహాలను నిర్మించడం జరిగిందని, అయితే గత ప్రభుత్వం ఈ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసిందన్నారు. ఈ ప్రాజక్టును పూర్తి స్థాయిలో స్టడీ చేసి ప్రాజక్టు స్థితిగతులను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఏపీ అర్బన్ ఫైనాన్సు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత ఈ పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి నియంతృత్వ ధోరణి విడనాడాలి

- బిజెపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్ ప్రకాష్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు:

నేడు స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత విచక్షణా రహితంగా దాడులు చేయించడం పట్ల బిజెపి రాష్ట్ర శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం.

రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్న విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం సరైనది కాదు. సమస్యల పరిష్కారం చేయాలని అనేక సందర్భాలలో వినతి పత్రాల రూపంలో ప్రత్యక్షంగా తెలిపినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించింది.



ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేద విద్యార్థులు బడుగు బలహీన వర్గాలకు చెందినవారు. మౌలిక వసతులు కల్పించాలని అన్ని వర్గాల ప్రజలు విద్యార్థులు కోరుతున్న విషయం వాస్తవం కాదా?

ఏబీవీపీ విద్యార్థి నాయకులు గాయపడడం జరిగింది. విద్యార్థి నాయకులకు చెప్పుకోలేని విధంగా పోలీసులు గాయం చేశారు. పోలీసులు విచక్షణా రహితంగా బయటకు కనిపించని విధంగా దాడులు చేయడం దుర్మార్గం. బూట్ కాళ్లతో తన్నడం, ఎవ్వరికీ కనిపించకుండా విద్యార్థుల చుట్టూ ముట్టి పిడిగుద్దులతో గుద్దడం పోలీసులు చేసిన పని. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. నిరసన ప్రదర్శనలపై రాష్ట్ర ప్రభుత్వము, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నియంతృత్వ, నిరంకుశ ధోరణి విడనాడాలి.

## ప్రజలతో కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు మూడురోజుల విరామం

- శనివారం నుంచి సోమవారం దాకా..కేసీఆర్‌తో సమావేశాలకు మూడురోజుల విరామం
- అధినేతకు మూడు రోజులపాటు విశ్రాంతినివ్వాలని పార్టీ నిర్ణయం
- తిరిగి ప్రకటన తర్వాతే తదుపరి సమావేశాలు పున: ప్రారంభం
- గత రెండువారాలుగా అప్రతిహతంగా కొనసాగుతున్న కేసీఆర్ తో ప్రజల ఆత్మీయ సమావేశాలు
- పదిహేనురోజుల్లో తమ అభిమాన నేతను కలిసిన దాదాపు యాభైవేల మంది కార్యకర్తలు.. నేతలు.. ప్రజలు
- ఫొటోలు సెల్ఫీలతో అధినేతను బంధీ చేసిన అభిమానం..
- ఎంతో ఓపికతో గంటలపాటు నిలబడి తన ఆత్మబంధువులతో గడిపిన కేసీఆర్
- ఆత్మీయ సమావేశాలతో సాకారమౌతున్న కేసీఆర్‌ను కలవాలనే ప్రజాభిమాన ఆకాంక్ష?

ఎర్రవెల్లి,మహానాడు:

గత పదిహేనురోజులుగా నిరంతరాయంగా కొనసాగుతున్న కేసీఆర్‌తో పార్టీ కార్యకర్తలు,అభిమానులు,



ప్రజల ఆత్మీయ సమావేశాలకు మూడురోజుల పాటు విరామం ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అధినేతతో పార్టీ ముఖ్యనేతలు చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ కార్యకర్తలు నేతలతో సమావేశమౌతున్న అధినేత కేసీఆర్, గత రెండువారాల నుండి ముందస్తు సమాచారంతో నియోజక వర్గాల వారీగా కలుస్తున్న సంగతి తెలిసిందే.

తనను చూసేందుకు ఎర్రవెల్లి నివాసానికివస్తున్న ప్రజలతో ఓపికతో గంటల పాటు నిలబడి కేసీఆర్ వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఫోటోలు దిగుతూ ప్రజలతో ఆత్మీయ సమావేశాలు కొనసాగిస్తున్నారు.

గత పదిహేను రోజుల నుంచి దాదాపు యాభై వేలకు పైగా ప్రజలు తమ అభిమాన నేతను తెలంగాణ తొలి ముఖ్యమంత్రిని కలిసి తమ ఆనందాన్ని కష్ట సుఖాలను ఆత్మీయతను పంచుకున్నారు.

తమ అభి మానంతో అధినేతను ఫోటోలు సెల్ఫీల్లో బంధించారు.

యే యే నియోజకవర్గాల వారు ఎప్పుడు రావాలి అనే విషయాలను, తర్వాతి ఆత్మీయ సమావేశాల వివరాలను ప్రకటించడం జరుగుతుంది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

6

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 29, జూన్ 2024

# జగన్ కాపాడకుంటే పిన్నెల్లి పాపాల పుట్ట ఎప్పుడో పగిలేది

- **రౌడీలకు రోజులు చెల్లాయనడానికి పిన్నెల్లి అరెస్టే సంకేతం**
- **ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



**పల్నాడు,మహానాడు:**
పల్నాడులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పెంచి పోషించింది, ఇంతకాలం కాపాడింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డే అన్నారు మాజీమంత్రి, చిలకలూరిపేట తెలుగుదేశం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మారడంతోనే రాష్ట్రంలో రౌడీమూకలకు కాలం చెల్లిందనడానికి పిన్నెల్లి అరెస్టుతో సరైన సంకేతం పంపినట్లైందన్నారాయన. ప్రజలందర్నీ భయం గుప్పిట్లోకి నెట్టి, ఆ భయమే పెట్టుబడిగా వేలకోట్లు సంపాదించుకుని, ఎంతోమంది తెలుగుదేశం పార్టీ వారి రక్తం కళ్లచూసినా రాక్షసుడు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అని ధ్వజమెత్తారు ప్రత్తిపాటి. మూడున్నర దశాబ్దాలుగా ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాలను చూస్తున్న తనకే గత అయిదేళ్లుగా మాచర్ల నియోజకవర్గంలో నెలకొన్న దారుణ పరిస్థితులు భీతి కలిగించాయన్నారు. అంతగా నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టించిన ప్రజాప్రతినిధిని చరిత్రలో చూడలేదన్నారు ప్రత్తిపాటి.

శుక్రవారం చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాటి పుల్లారావు మీడియాతో మాట్లాడారు. మాచర్ల కేంద్రంగా పిన్నెల్లి నిర్మించిన నేరసామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించడానికి ఇక సమయం ఆసన్నమైందన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు దెబ్బతో పల్నాడు ప్రాంత వైకాపా నేతలతో పాటు ఇంతకాలం జగన్ అండతో చెలరేగిపోయిన రౌడీలందర్నీ వణుకు మొదలైందన్నారు ప్రత్తిపాటి. వెయ్యి గొడ్లను తిన్న రాబందు కూడా ఒక్క గాలివానతో కొట్టుకుని పోక తప్పదని, అలానే ప్రభంజనం లాంటి విజయంతో రాష్ట్రంలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వంతో పిన్నెల్లి మాఫియా ఆటకట్టిందని ఆయన చుర కలు వేశారు. పరారీలో ఉన్న పిన్నెల్లి సోదరు వెంకటరామిరెడ్డి, వాళ్ల చేతుల్లో ఆయుధాల్లా పని చేసిన చేసిన తురకా కిషోర్ ముఠానూ సాధ్యమైనంత త్వరగా పట్టుకోవాలని, పల్నాడులో పూర్తి స్థాయి ప్రశాంత పరిస్థితులు నెలకొల్పడంతో అదే కీలకమని ప్రత్తిపాటి సూచించారు.

నిజానికి పిన్నెల్లి అయిదేళ్లుగా ఎన్నో నేరాలు, ఘోరాలు చేసినా బీసీ నాయకుడు తోట చంద్రయ్య హత్య రోజు నుంచే పిన్నెల్లి రాజకీయ పతనం ప్రారంభమైందన్నారు ప్రత్తిపాటి. అసలు ఇలాంటివ్యక్తికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండడానికే ఏమాత్రం అర్హతలేదన్నారు. బాధితులపైనే ఎదురుకేసులు పెట్టించి దోచుకున్న పిన్నెల్లి ముఠా వేళ్లు కత్తిరింపుతోనే ప్రశాంత పల్నాడు సాధ్యమని, ఇంతకాలం అతడి దురాగతాలకు అండగా నిలిచిన పోలీసు సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు ఉన్నతాధికారులను ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.

# పిన్నెల్లిపై మరో కేసు

**మాచర్ల,మహానాడు:**
మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఐపీసీ సెక్షన్ 323 కింద మాచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. తెలుగు యువత పల్నాడు జిల్లా కార్యదర్శి కొమర శివపై పిన్నెల్లి మాచర్ల కోర్టు వద్ద పిడికిలితో కడుపులో గుద్ది దాడి చేశారని పేర్కొంటూ శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు.




- **పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యం**
- **విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తాం.**
- **విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి.**
- **స్కూల్ విద్యార్థులకు కిట్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**



# విద్యార్థుల దశ దిశ మార్చేది విద్యే..

**అమరావతి, మహానాడు:**
ఈరోజు అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ నందు జరిగిన ప్రభుత్వ పాఠశాల యందు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసి వారిని ఉద్దేశించి మాట్లాడిన పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాలవిద్యే విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు.
చదువుతోపాటు బాల బాలికల్లో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల పెంపుకు ఉపాధ్యాయుల కృషి చేయాలన్నారు. పది పూర్తి చేసుకొని కళాశాల విద్యకు వెళ్లే విద్యార్థులు సుశిక్షితులుగా పూర్తిస్థాయి పరిజ్ఞానంతో బయటకు వెళ్లేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్స్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలన్నారు. అమరావతి మండలంలో మొత్తం 4,000 మంది విద్యార్థులకు తొమ్మిది రకాల విద్యా సామాగ్రితో కూడిన కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పాఠశాల యాజమాన్యం ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్‌ని దుశాలవా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యాధికారులు మరియు మండల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు దక్కిన అరుదైన గౌరవం..

- **స్వర్ణ నాగరాజుకు అమెరికాకు చెందిన హెచ్.ఎస్.సి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం.**

**నరసరావుపేట, మహానాడు:**
సేవా కార్యక్రమాలు చేస్తూనే సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు మా ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపించి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో పేదలకు యాచకులకు రాత్రి వేళ ఆహారం అందించి ఆకలి తీరుస్తున్న స్వర్ణ నాగరాజు సేవలను గుర్తించిన అమెరికాకు చెందిన హెలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ (హెచ్.ఎస్.సి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గురువారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో యూనివర్సిటీకి చెందిన శాఖ భవనంలో స్వర్ణ నాగరాజును యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్ సత్కరించి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. నేటి యువకులు స్వర్ణ నాగరాజును స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలో భాగంగా రాత్రి సమయంలో బయట తిరిగే క్రమంలో యాచకులు, ఏ ఆధారం లేని వృద్ధులు పడుతున్న అవస్థలు చూసి ఆవేదనకు గురయ్యానని రాత్రి సమయంలో ఆహారం దొరకక నీటితో కడుపు నింపుకుంటున్న యాచకుల దయనీయ పరిస్థితి కలిచి వేసిందన్నారు. కొద్దిపాటి ఆదాయం మొత్తాన్ని యాచకుల ఆకలి తీర్చేందుకు వెచ్చిస్తున్నానని గమనించిన మిత్రులు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో వైరల్ చేశారని గుర్తించిన హెచ్.ఎస్.సి యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు.



డాక్టరేట్ దక్కడం సేవా కార్యక్రమాల పట్ల బాధ్యతను మరింత పెంచిందన్నారు. గౌరవ డాక్టరేట్ రావడానికి సహకరించిన యూనివర్సిటీకి, సెలక్షన్ కమిటీకి, అవార్డు అందించిన పెద్దలకు నేను చేస్తున్న సేవ కార్యక్రమలకు సహకరించిన మిత్రులకు శ్రేయోభిలాషులు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు.

# పిన్నెల్లి పాపం పండింది

- **పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్**

**మంగళగిరి,మహానాడు:**
ప్రస్తుతం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నారు. తెలుగుదేశం పార్టీ రావడంతో పల్నాడు జిల్లా ప్రజలు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవరి మీద కేసు పెడతారో, ఎలాంటి అరాచకాలు జరుగుతాయో అని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. పల్నాడు జిల్లా మాచర్ల ప్రజలకి నేడు స్వాతంత్రం వచ్చింది. స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారు. పిన్నెల్లి అరెస్టు ఆనందదాయకం.

పిన్నెల్లిని అక్రమంగా అరెస్టు చేశారని వైసీపీ నాయకులు చెప్పడం ఒక అభూత కల్పన మాత్రమే. వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యక విధానాన్ని తుంగలో తొక్కింది. పిన్నెల్లి, ఆయన సోదరులు చేసిన అన్యాయాలు, అక్రమాలు అన్నీ ఇన్ని కావు. అక్రమ మైనింగ్ తో కోట్లు గడించారు పిన్నెల్లిని అరెస్టు చేయడం ఇదొక ట్రైలర్ మాత్రమే. పిన్నెల్లి చేసిన అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు అన్నింటిని బయటపెడతాం. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ఎమ్మెల్యే పిన్నెల్లి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అప్పుడు ఒక నియంతలా వ్యవహరించారు.

ప్రభుత్వానికి అందాల్సిన కప్పాలన్నింటిని తన జేబుల్లో నింపుకున్నారు. అక్రమ ఆస్తులు సంపాదించుకున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే రౌడీల చేత దౌర్జన్యాలు చేయించారు. తెలుగుదేశం పార్టీ నాయకులపై హత్యా ప్రయత్నాలు జరిగిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. పిన్నెల్లి అరెస్టు సందర్భంగా టిడిపి యువ నాయకుడు ముందుకొస్తే అతనిపైన కూడా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు.
పిన్నెల్లి లో ఇంకా అహం చావలేదు. పిన్నెల్లికి జైలు కూడా తప్పదు. అహంకారంతోటి కొట్టుమిట్టాడుతున్నారు. పల్నాడు జిల్లా ప్రజలు విశ్వసనీయతకు మారుపేరు. అలాంటి వారిని ఇబ్బంది పెట్టారు. టిడిపి నాయకుల పై అనవసరంగా కేసులు పెట్టి వేధించారు. ఈ ఐదేళ్లు వైసిపి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. టిడిపి నాయకుల పై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేయించారు.

వైసీపీ నాయకులకు కూడా ఇదే పరిస్థితి రావచ్చని గ్రహించలేకపోయారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది. ధర్మమే నిలుస్తుంది. అందుకు నిదర్శనం టిడిపి గెలవడమే. ఇకమీదట వైసీపీ నాయకుల ఆటలు సాగవు. వైసీపీ పేజీ ముగిసింది. ఇక వైసిపి నాయకులు తోకముడవాల్సిందే. ఇక వైసీపీ నాయకులకు భయపడి పల్నాడు జిల్లాను వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితిలో వచ్చాయి. ఇలాంటి దారుణాలు అనేకం జరిగాయి. ఇన్ని దారుణాలు జరుగుతున్నా.. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గాని, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గాని మంచి, చెడుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.




భవిష్యత్తులో వైసిపికి కాలం చెల్లింది.

**కిరాయి గుండాలాగా వ్యవహరించారు: ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

అవినీతి, అక్రమాలు, దుర్మార్గాలకు వైసీపీ నాయకులు పెట్టని కోటగా ఉండేవారు. ఈ ఐదేళ్లు పల్నాడు గడ్డమీద గుట్కా, గంజాయి, డ్రగ్స్ మాఫీయా రాజ్యమేలింది. వైసీపీ ఎమ్మెల్యేలు, వారి మంత్రులు మాఫియా రాజ్యం ఏలారు. ఈ మాఫియాపై జగన్, ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు ఏనాడూ చర్యలు తీసుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రయత్నం చేయలేదు. పల్నాడు జిల్లాలో ఈ ఐదేళ్లుగా ఎంతో మందిని పొట్టన పెట్టుకున్నారు.

పెద్దకోటయ్య, జల్లయ్య ఇలా ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారు. అనేకమంది పై హత్యా ప్రయత్నాలు జరిగాయి.

ఒక్కసారికూడా ప్రజల మనోభావాలు దెబ్బతింటాయి అని ఆలోచించలేదు. టిడిపి వారి ఇళ్ళపైకి దాడులు చేయడం జరిగింది. కిరాయి గుండాలతో, పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని పరిపాలన సాగించారు. ప్రజలకు వారిపై ఎంత కోపం ఉంటుందో ఒకసారి కూడా వారు ఆలోచించలేదు. అలజడులు సృష్టించుకుంటూ వెళ్లారు. అందువల్ల మొన్న జరిగిన ఎన్నికల్లో మాచర్ల లో విపరీతమైన మెజార్టీ వచ్చింది. ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని వైసీపీ నాయకులు గ్రహించలేకపోయారు. ఎమ్మెల్యే అంటే కిరాయి గుండా లాగా వ్యవహరించారు. పల్నాడు జిల్లాలో ప్రజలు టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించారు. గెలిచినవారు మంచి పరిపాలన చేయాలి. ఎన్నికలప్పుడు రెంటచింతల మండలం పాల్వాయి లో ఏవీఎంలు పగలగొట్టడం జరిగింది. శిరోమణి మీద దాడి చేయడం జరిగింది. కారంపూడిలో నారాయణస్వామి పై దాడి జరిగింది. అనేకసార్లు టిడిపి నాయకులు కార్యకర్తల మీద దాడులు జరిగాయి.
వీటన్నింటిని ప్రజలు దృష్టిలో పెట్టుకున్నారు. అందుకే సరైన శిక్ష వేశారు. అనేక దాడులు చేశారు. న్యాయమే ఎప్పుడూ గెలుస్తుంది. ఈ సందర్భంగా పిన్నెల్లి ని అరెస్ట్ చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడం జరిగింది. గెలిచిన ఎమ్మెల్యేలు నీతి నిజాయితీతో ఉండి ప్రజలకు అండగా నిలవాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. అందుకు కలిసికట్టుగా కృషి చేయాలి. ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి అందుకు అందరూ ఏకమవ్వాలి.

**పిన్నెల్లి బ్రదర్స్‌ని ప్రజలు నరరూప రాక్షసులు: - ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు**

కోర్టు ఆదేశాల మేరకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలుకెళ్లాడు. గత ఐదు సంవత్సరాలు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దోపిడీకి ఉపయోగించుకున్నారు. అనేకమంది తెలుగుదేశం కార్యకర్తలను, చంద్రయ్యని, జల్లయనను పొట్టను పెట్టుకున్నారు. చనిపోయిన వాళ్ళ బంధువులను కూడా ఇరికించి పాపాలు చేశారు. అనేకచోట్ల భూములు కబ్జాలు చేశారు. ప్రజల ఆస్తులు కబ్జా చేశారు. లిక్కర్ మాఫియాకు పాల్పడ్డారు. చేయని నేరాలు లేవు నేరాలు-ఘోరాలు లేవు. దోపిడీలు చేసిన పల్నాడు బ్రదర్స్ ని ప్రజలు నరరూప రాక్షసులుగా చూశారు.

ఈరోజు ప్రజలందరూ ఇలాంటి వారిని దేశ ద్రోహం కింద తరిమేయాలి. చేసిన పాపాలు పండాయి. ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పారు. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని, పోలీసుల చేత చట్టాన్ని తుంగలో తొక్కించారు. అనేక తప్పులు చేయించారు. టిడిపి నాయకుల పైన దాడులు చేయించారు. అనేక బూత్‌లు ఆక్రమించుకున్నారు. విధ్వంసాలు సృష్టించారు. దోపిడీ, దౌర్జన్యాలు చేశారు. ప్రజల్ని హింసించారు.

ఈ దుర్మార్గులకు ప్రజా కోర్టులో శిక్ష పడింది. వీరు చేసిన నేరాలు అన్ని వెలికి తీసి వీరిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి నరరూప రాక్షసులను వదలకూడదు. వీరందరూ జైళ్ళల్లో ఉండాలి. సహకరించిన అధికారులు, చట్టాలను తుంగలో తొక్కిన అధికారుల్ని వదలకూడదు. దర్యాప్తు జరపాలి. తప్పు చేసిన అధికారులను చట్టానికి పట్టివ్వాలి.

అక్రమాలకు పాల్పడిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతాం. తప్పు చేసిన అధికారులు, పిన్నెల్లి బ్రదర్స్ కి శిక్ష తప్పదు. పిన్నెల్లి తో పాటు అనేక అక్రమాలు చేసిన తమ్ముడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని కూడా వెంటనే అరెస్టు చేయాలి.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
7
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 29, జూన్ 2024

# పార్టీ బలోపేతానికి తెలుగు యువత బాధ్యతగా కృషి చేయాలి

● గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ

మంగళగిరి, మహానాడు:
క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి తెలుగుయువత బాధ్యతగా కృషి చెయ్యాలని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు తెలుగు యువతకు సూచించారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులై మంగళగిరిలో తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస రావుని మర్యాదపూర్వకంగా కలిసి గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ, మాజీ తెలుగుయువత అధ్యక్షులు కొమ్మినేని సాంబశివరావు మరియు తెలుగుయువత నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



# డీజీపీ ద్వారక తిరుమలరావును అభినందించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

విజయవాడ, మహానాడు:
గత మూడు దశాబ్దాలుగా, నిబద్ధతో, అవినీతి రహితంగా నిజాయితీగా కృషి చేస్తున్న ద్వారక తిరుమల రావు ఐపియస్‌ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర డిజిపిగా నియమించడం హర్షణీయమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ రాత్రి తాడేపల్లిలోని రాష్ట్ర డిజిపి కార్యాలయంలో డిజిపి ద్వారక తిరుమల రావుని కలిసి శాలువ కప్పి, గాంధీజీ చిత్రపటాన్ని బహుకరించి, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో బహిరంగ మద్య సేవనాన్ని అరికట్టడానికి కృషి చేయాలని డిజిపిని కోరారు. మద్యం త్రాగి వాహనాలు నడపడంతో రోడ్ ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి టోల్‌గేట్ వద్ద బ్రీత్ ఎనలైజర్స్‌లను వినియోగించి ర్యాండంగా డ్రైవర్లను పరీక్షించడం ద్వారా రోడ్ ప్రమాదాలు తగ్గించవచ్చునని వివరించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో వందలాది ఎకరాలలో గంజాయిని సాగు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ఒరిస్సా ప్రభుత్వ తోడ్పాటుతో యుద్ధ ప్రాతిపదికన గంజాయి సాగును ధ్వంసం చేయాలని కోరారు. చెక్‌పోస్టులు పెంచి గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పానీయాలపై ఉక్కుపాదం మోపడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా రూపొందించగలమని తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడా నాటు సారా, కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిని గుర్తించి, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి, నాటు సారా, కల్తీ కల్లును నిర్మూలించాలని కోరారు. ఈ సూచనలతో అందించిన వినతి పత్రాన్ని పరిశీలించిన డిజిపి ద్వారక తిరుమల రావు సానుకూలంగా స్పందించారు. డ్రగ్స్, గంజాయి, నాటు సారా, కల్తీ కల్లు నిర్మూలనకు కృషి చేస్తామని, బహిరంగ మద్య సేవనాన్ని నిర్మూలిస్తామని, టోల్ గేట్ల వద్ద బ్రీత్ ఎనలైజర్స్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.



# ప్రశాంత పల్నాడుకు పిన్నెల్లి అరెస్టు తొలి అడుగు మాత్రమే..

● జీవీ ఆంజనేయులు

పల్నాడు, మహానాడు:
ప్రశాంత పల్నాడు కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు తొలి అడుగు మాత్రమే అన్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఈ దెబ్బతో పల్నాడును సొంత జాగీరుగా, మాఫియా అడ్డాగా చేసుకున్న రౌడీమూక ఆటకట్టిందన్నారాయన. పచ్చనిపల్లెల్లో ఫ్యాక్షన్ నెగళ్లు ఎగదోసిన పిన్నెల్లి మిగిలిన పరివారం సహా ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. మాచర్ల నియోజవర్గం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరెస్టు, అనంతర పరిణామాలపై ఆయన శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అరాచాక వైకాపా సర్కారు పోవడంతో శాంతి భద్రతలకు తిరిగి మంచిరోజులు వచ్చాయని, పోలీసులు తమ పని తాము చేసుకోవచ్చని పిన్నెల్లి అరెస్టుతో స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లైందన్నారు జీవీ. అయిదేళ్లుగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని పిన్నెల్లి ఎన్నో నేరాలు, ఘోరాలకు పాల్పడ్డారని వాటన్నింటికీ శిక్షలు పడితే జీవిత కాలం అతడు జైలు నుంచి బయటకు వచ్చే అవకాశమే లేదన్నారు. ఇవే నేరాల్లో సాధ్యమైనంత త్వరలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా కటకటాల ఊచలు లెక్కించడం ఖాయమన్నారు జీవీ. మైనింగ్ అక్రమాలు, సహజవనరుల లూటీతో పాటు మాచర్ల నియోజక వర్గం మొత్తం వ్యాపారులు, సామాన్యులు బెదిరించి పిన్నెల్లి చేసిన ఘోరాలపైనా సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కమాచర్ల నియోజకవర్గంలోనే పిన్నెల్లి గడిచిన 5ఏళ్లలో 2వేల కోట్ల రూపాయలకు పైగా దోపిడీ చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అతడి వల్ల నష్టపోయిన స్థానిక బాధితులు ఇప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి తమ బాధలు చెప్పుకోవచ్చన్నారు జీవీ. వీటన్నింటికీ మించి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై పిన్నెల్లి సోదరులు సాగించిన మారణ కాండపై ఇకనైనా కఠినచర్యలు తీసుకోవాలని, తగిన సెక్షన్ల కింద సేల్ను పెట్టాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు జీవీ. పల్నాడు జిల్లా తెలుగుయువత జిల్లా కార్యదర్శి శివపై దాడికి సంబంధించి కేసు పెట్టినట్లే గతంలో పిన్నెల్లి చేసిన దారుణాలన్నింటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరీ ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నడిరోడ్డుపై గొంతుకోసి చంపిన తెలుగుదేశం కార్యకర్త తోటచంద్రయ్యకు ఇకనైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా నేరం చేసినవాడు ఎంత పెద్దవాడైనా, ఎప్పటికైనా చట్టం చేతికి చిక్కడం ఖాయమని, చట్టబద్ధ పాలన తిరిగి నెలకొందనే నమ్మ కాన్ని ప్రజల్లో కలిగించాలన్నారు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.




# దేవాలయాల దర్శనార్థం ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసిన గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కి స్వాగతం పలికిన జిల్లా అధికారులు

గుంటూరు, మహానాడు:
గుంటూరు పట్టణం కృష్ణనగర్‌లో ఉన్న లక్ష్మీనారాయణ దేవస్థానానికి దర్శనార్థం విచ్చేసిన తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్ మరియు పుదుచ్చేరి గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళ మాధవిలు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో గవర్నర్‌కి ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గవర్నర్ మీడియా వారితో మాట్లాడుతూ దేవాలయాల దర్శనార్థం ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చానన్నారు. చిరకాల మిత్రులు క్రొత్తగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడుని కలిసి అభినందనలు తెలపడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి పట్ల ఎంతో ఉత్సాహాన్ని ఆయన కలిగి ఉన్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వారితో మాట్లాడం జరిగిందన్నారు. దక్షిణ భారతంలో వున్న నదుల అనుసంధానం వల్ల వర్షపు జలాలు నిరుపయోగంగా సముద్రంలో కలవ కుండా వుంటుందని, అందువల్ల నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నానన్నారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీఖర్, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర హెూం మినిస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన

# మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మోహన్

విజయవాడ, మహానాడు:
రాష్ట్ర హెూం మినిస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మోహన్ మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూం మినిస్టర్ వంగలపూడి అనితని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. వారితో పాటు తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాశాలలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అధితిగా రావలసిందిగా హెూం మినిస్టర్‌ని కోరగా వారు సానుకూలంగా స్పందించారని,వస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.





వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్.. పల్నాడు జిల్లాలో పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

- ఏపీ స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో హెూంమంత్రి అనిత
- 8 జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులపై ఆరా
- వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం
- ఏపీ ఎమర్జెన్సీ అలర్ట్ సెంటర్‌ను స్వయంగా పరిశీలించిన మంత్రి అనిత
- ఏపీ స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ విధులను మంత్రి అనితకు వివరించిన అధికారులు

విజయవాడ,మహానాడు:
ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధిక వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అలర్ట్ గా ఉండాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐఎండి అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాల ప్రభావంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైయ్యే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడూ వరద ప్రవాహాన్ని పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జూన్ నెలలో ఇప్పటివరకు 12 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 9 జిల్లాల్లో అధికం, 5 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయంలోపు అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, కృష్ణా, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు నమోదైందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధిలో అత్యధికంగా 184 మి.మీ అతిభారీ వర్షపాతం నమోదైందన్నారు. తరచూ వరదలు సంభవించే నదీపరివాహక ప్రాంతాల్లో చెరువులు, వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, సంభవించే వరదలపై కూడా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్..

అధిక వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అనిత సమీక్షించారు. తుఫాను ప్రభావంతో నదీపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగుల ద్వారా గోదావరి, వంశధార, నాగావళి తదితర నదుల్లోకి వరద నీరు చేరుతోందని అన్నారు. వర్షాలు, వరదలపై ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎల్లో అలర్ట్ జారీ చేశారన్నారు.

ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ.. వారం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయన్నారు. వర్షాలు, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో దేవీపట్నం నదీపరివాహక ప్రాంతంలో వీఆర్వో, వీఆర్ఏలతో పాటు ఇతర అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు కూడా తీసుకున్నారని తెలిపారు.



దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారని, సహాయక చర్యల నిమిత్తం గ్రీవెన్స్ సెల్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

డా.బి.ఆర్.అంబేద్కర్, శ్రీకాకుళం జిల్లా డీఆర్వోలు మాట్లాడుతూ.. అధిక వర్షాల నేపథ్యంలో అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకున్నామని, ఎక్కడా కూడా ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అనిత స్పందిస్తూ.. అధికారులు అలర్ట్ గా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల సంభవించే పరిస్థితులపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతాలైన నాసిక్, భద్రాచలం వంటి ప్రాంతాల్లో వర్షాలు, వరదల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. గొట్టా బ్యారేజీ వంటి తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో తహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

### ఏపీ ఎమర్జెన్సీ అలర్ట్ సెంటర్ పరిశీలన..

స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ ను మంత్రి అనిత స్వయంగా పరిశీలించగా 24/7 వాతావరణాన్ని పర్యవేక్షించే విధానాన్ని అధికారులు మంత్రికి వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాలలోని వివిధ అంశాలను తెలిపారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

విపత్తుల సమయంలో నిరంతరం పర్యవేక్షిస్తూ అలర్ట్స్ పంపే విధానాన్ని అధికారులు మంత్రికి విశదీకరించారు. కామన్ అలెర్ట్ ప్రోటోకాల్ , ఏపీ అలెర్ట్ సెంటర్ ద్వారా ప్రజలకు హెచ్చరిక సందేశాలు ఏవిధంగా చేరుతాయో ప్రత్యక్షంగా చూపించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్ , వాకీటాకీ, వి-శాట్ కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు, సిబ్బంది పనితీరును మంత్రి ప్రశంసించారు.

అనంతరం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును మంత్రి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ఈడీ సి.నాగరాజు, సంస్థ అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | శనివారం 29, జూన్ 2024



## “భజే వాయు వేగం”

ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై హీరో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన “భజే వాయు వేగం” సినిమా గత నెల 31న థియేటర్స్‌లో రిలీజై సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. ఈ రోజు నుంచి నెట్ ఫ్లిక్స్‌లో “భజే వాయు వేగం” సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. “భజే వాయు వేగం” సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో చూస్తున్న ఆడియెన్స్ మూవీలో తమకు నచ్చిన సన్నివేశాల స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. “భజే వాయు వేగం” సినిమాలో ఐశ్వర్య మీనన్ హీరోయిన్‌గా నటించింది. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషించారు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. అజయ్ కుమార్ రాజు.పి. కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు.



## “కల్కి”లో అర్జునుడిగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న విజయ్

రెబెల్ స్టార్ కల్కి సినిమా నిన్న ప్రేక్షకుల ముందుకొచ్చి రికార్డ్ స్థాయిలో ఓపెనింగ్స్ అందుకుంది. వైజయంతీ మూవీస్‌లో దర్శకుడు నాగ్‌అశ్విన్ ఫ్యూచరిస్టిక్ ఇండియన్ సినిమాగా కల్కిని రూపొందించాడు. ఈ సినిమాలో అనేక గెస్ట్ రోల్స్ ఉన్నాయి. వాటిలో హైలైట్ అవుతోంది విజయ్ దేవరకొండ నటించిన అర్జునుడి పాత్ర. ఈ క్యారెక్టర్‌లో విజయ్ పర్ఫెక్ట్‌గా సరిపోయారు. అర్జునుడు కురుక్షేత్ర యుద్ధ సందర్భంలో చూపించే బలమైన ఎమోషన్స్ తన నటనతో పలికించారు విజయ్ దేవరకొండ. నిడివి తక్కువే అయినా అర్జునుడిగా విజయ్ మేకోవర్, చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్స్ కల్కిలో ఒక హైలైట్‌గా నిలుస్తున్నాయి. విజయ్ క్యారెక్టర్ స్క్రీన్ మీదకు వచ్చినప్పుడు ప్రేక్షకుల నుంచి హ్యూజ్ అప్లాజ్ వస్తోంది. విజయ్‌ను మైథాలజీ పాత్రల్లో చూసే అవకాశం అరుదు కాబట్టి కల్కి సినిమా ఆయన కెరీర్‌లోనూ ఓ స్పెషల్ మూవీ అనుకోవచ్చు.

### స్ట్రీమింగ్‌కు వచ్చేసిన
## “సత్యభామ”


స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన “సత్యభామ” సినిమా డిజిటల్ ప్రీమియర్ కు వచ్చేసింది. నేటి నుంచి ఈ సినిమా అమోజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాష్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 7వ తేదీన థియేట్రికల్ రిలీజ్ కు వచ్చింది సత్యభామ. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ సత్యభామగా కాజల్ అగర్వాల్ నటన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఓ హత్యకేసులో ఎమోషనల్ అయిన సత్యభామ ఆ కేసును ఒక ఛాలెంజ్ గా తీసుకుని ఎలా సాల్వ్ చేసింది, బాధితురాలికి ఎలా న్యాయం చేసింది అనేది ఈ సినిమాలో హార్ట్ టచింగ్‌గా, ఇంటెలిజెంట్‌గా చూపించారు. సత్యభామలో కాజల్ అగర్వాల్ యాక్షన్ సీక్వెన్సులు హైలైట్ అయ్యాయి. సత్యభామ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. “మేజర్” చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. థియేటర్ కంటే ప్రైమ్ వీడియోలోనూ మరింత మంచి రెస్పాన్స్ వస్తుందని మూవీ టీమ్ ఆశిస్తున్నారు.





## “దీక్ష” షూటింగ్ పూర్తి

ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్ బ్యానర్స్‌పై ప్రముఖ దర్శక, నిర్మాత, తెలంగాణ ఫిలిమ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం ‘దీక్ష’. పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మాతలు. కిరణ్ కుమార్, అలేఖ్యరెడ్డి జంటగా నటిస్తున్నారు. ఇటీవల తెలంగాణ ఫిలింఛాంబర్‌లో చిత్ర ప్రోగ్రెస్ ను తెలిపే కార్యక్రమంలో ఆర్ కే గౌడ్, హీరో కిరణ్, నటి తులసి,రైటర్ రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ మాట్లాడుతూ – నలభై సినిమాలకు దర్శకత్వం వహించిన రామకృష్ణ గౌడ్ గారు ‘దీక్ష’ మూవీతో మళ్లీ మెగాఫోన్ పట్టడం సంతోషంగా ఉంది. ఇప్పటి యంగ్ డైరెక్టర్స్‌లా చాలా అప్డేటెడ్‌గా, ప్లానింగ్‌తో ‘దీక్ష’ మూవీ రూపొందిస్తున్నారు. గతంలో నేను తెలుగులో పది తమిళంలో రెండు సినిమాలు హీరోగా చేశాను ఈ సినిమాతో నాకు మంచి పేరుతో పాటు అవార్డ్స్ వస్తాయని ఆశిస్తున్నాను. మూవీ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. రియలిస్టిక్‌గా ఒక భారీ ఫైట్ సీక్వెన్స్ చేశాం. స్టంట్ మాస్టర్ రవికుమార్ చాలా బాగా ఆ ఫైట్ చేయించారు. ఒక నిమిషం పాటు ఉండే డైలాగ్ ఒకటి ఈ మూవీలో నాతో చెప్పించారు అన్నారు.



## జూలై 1న ‘డబుల్ ఇస్మార్ట్’ ఫస్ట్ సింగిల్

ఉస్తాద్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియన్ ఫిల్మ్ ‘డబుల్ ఇస్మార్ట్’తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రాన్ని పూరి జగన్నాధ్, ఛార్మికౌర్ సగర్వంగా నిర్మించారు. ఈ మూవీ ఆగస్ట్ 15, 2024న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్‌లను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. ఫస్ట్ పార్ట్‌కి చార్ట్-బస్టర్ ఆల్బమ్, అద్భుతమైన బీజీఎం అందించిన మ్యాజికల్ కంపోజర్ మణిశర్మ ఇప్పుడు మళ్లీ అదరగొట్టబోతున్నారు. ఫస్ట్ సింగిల్ ‘స్టెప్పా మార్’ని జూలై 1న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. శివుడి విగ్రహం ముందు రామ్ పోతినేని కంప్లీట్ స్టైలిష్ వైబ్‌లో డ్యాన్స్ చేస్తున్నట్లు ప్రజెంట్ చేసిన అద్భుతమైన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ఎలక్ట్రిఫైయింగ్ ట్యూన్ గా మాస్ ప్రేక్షకులకు ఇన్స్టంట్ ఎడిక్షన్ కానుంది.

## కల్కితో బిగ్ హిట్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే ప్రస్తుతం పాన్ వరల్డ్ హీరోయిన్‌గా తనదైన బ్రాండ్ క్రియేట్ చేసుకుంది. అలాగే అత్యధిక బ్రాండ్ వేల్యూ ఉన్న హీరోయిన్స్‌లో దీపికా పదుకునే నెంబర్ వన్ స్థానంలో ఉంది. కెరియర్ ఆరంభంలో కన్నడంలో ఉపేంద్రకి జోడీగా ఆమె తన మొదటి సినిమా చేసింది. తరువాత షారుఖ్ ఖాన్ ఓం శాంతి మూవీతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే ఛాన్స్ లేకుండా స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. హాలీవుడ్ మూవీలో కూడా దీపికా పదుకునే నటించింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఇండియాలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న స్టార్ హీరోయిన్‌గా దీపికా పదుకునే ఉంది. ఈమె గత ఏడాది షారుఖ్ ఖాన్‌కి జోడీగా పఠాన్, జవాన్ సినిమాలలో నటించింది. ఈ రెండు సినిమాలు వెయ్యి కోట్లకి పైగా కలెక్షన్స్ రాబట్టాయి. బ్యాక్ టూ బ్యాక్ వెయ్యి కోట్ల కలెక్షన్స్ సాధించిన సినిమాలలో భాగమైన హీరోయిన్‌గా దీపికా పదుకునే అరుదైన ఘనత సాధించింది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ లీడ్ రోల్ చేసిన కల్కి 2898ఏడీ మూవీ తాజాగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి స్టార్స్ నటించిన పాన్ వరల్డ్ మూవీగా ఈ చిత్రం రిలీజ్ అయ్యింది. ఈ మూవీలో కల్కికి జన్మనివ్వబోయే తల్లిగా దీపికా పదుకునే పాత్ర ఉంటుంది. మూవీలో ఆమె పాత్ర చాలా బలంగా, పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉండేలా ఉంది. దీపికానే ఆ క్యారెక్టర్‌ని బెస్ట్ ఛాయస్ అని సినిమా చూసినవారు అంటున్న మాట.



## ఘనంగా ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్. నందమూరి . తారకరామారావు గారి పేరిట సినిమా రంగంలో అన్ని విభాగాలలో ప్రఖ్యాతి గాంచిన సినీ నటి నటులకు “కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్” 2024, హైదరాబాద్‌లోని హెూటల్ “దసపల్లా”లో నందు అవార్డుల ప్రధానోత్సవం అతిరధ మహారథుల సమక్షంలో జరుగును. “కళావేదిక” ఆర్.వి.రమణ మూర్తి, “రాఘవి మీడియా” ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహింప బడును. ముందుగా ఈ కార్యక్రమం యొక్క పోస్టర్ లాంచ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీద జరిగింది. ఈ సందర్భంగా వేడుకకు విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్క, సెన్సేషనల్ డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరో నారా రోహిత్,




హీరోయిన్ అనన్య నాగళ్ళ, సింగర్ రాహుల్ సిప్లిగంజ్ మరియు ఇంకొంత మంది ప్రముఖులు విచ్చేస్తున్నారు..

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144